ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
బుధవారం, 2 ఏప్రిల్ 2025



వీవీఐపీ, వీఐపీ సెక్టార్ల పరిధిని పెంచిన దృశ్యం



కల్యాణ మండపం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్

కల్యాణ వేడుక.. కావాలి పండుగ..

భద్రాచలంలో ఈ నెల 6న శ్రీరామ నవమి వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ తెలిపారు. భద్రాచలంలో మంగళవారం సాయంత్రం మిథిలా స్టేడియం, రామాలయ పరిసరాల్లో నవమి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. సీతారాముల కల్యాణ వేడుకకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని, కల్యాణాన్ని కలకాలం గుర్తుండేలా వైభవంగా జరపాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. సెక్టార్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి నిలపాలని, సెక్టార్లకు వెళ్లే మార్గాల్లో, రామాలయ పరిసరాల్లో భక్తులకు కాళ్లు కాలకుండా కొబ్బరిపీచుతో మ్యాట్‌లు ఏర్పాటు చేయాలని, లడ్డూ ప్రసాద కొనుగోళ్లు, తలంబ్రాల పంపిణీ సమయంలో ఎటువంటి ఇబ్బంది తలెత్త కుండా కౌంటర్ల సంఖ్యను మరింతగా పెంచాలని, కల్యాణం తిలకించే భక్తుల కోసం ఎల్‌ఈడీ స్క్రీన్ల సంఖ్యను పెంచాలని ఆదేశించారు.

- నవమి ఏర్పాట్లలో లోటుపాట్లు ఉండకూడదు
- భక్తులకు కొబ్బరిపీచుతో మ్యాట్ ఏర్పాటు చేయండి
- లడ్డూ, తలంబ్రాల కౌంటర్లు మరిన్ని పెంచండి
- రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్
- భద్రాచలంలో శ్రీరామ నవమి వేడుకల ఏర్పాట్ల పరిశీలన

భద్రాచలం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమికి చేపట్టే ఏర్పాట్లలో ఏమాత్రం లోటుపాట్లు ఉండకుండా చూడాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ ఆదేశించారు. భద్రాచలంలో మంగళవారం సాయంత్రం మిథిలా స్టేడియం, రామాలయ పరిసరాల్లో నవమి ఏర్పాట్లను ఐటీడీఏ పీవో బి.రాహుల్, భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఆర్డీవో దామోదర్‌రావులతో కలిసి పరిశీలించారు. సెక్టార్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి నిలపాలని ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో సెక్టార్లకు వెళ్లే మార్గాల్లో, రామాలయ పరిసరాల్లో ఎక్కడ భక్తులకు కాళ్లు కాలకుండా కొబ్బరిపీచుతో మ్యాట్‌లు ఏర్పాటు చేయాలని దేవస్థానం అధికారులకు సూచించారు. ఈ సమయంలో దేవస్థానంలో ఇప్పటికే ఈ సౌకర్యాన్ని అమలు చేస్తున్నామని అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

ప్రస్తుతం ఉన్న లడ్డూ, తలంబ్రాల కౌంటర్ల సంఖ్యను మరింతగా పెంచాలని కమిషనర్ శ్రీధర్ దేవస్థానం అధికారులకు స్పష్టం చేశారు. లడ్డూ ప్రసాద కొనుగోళ్లు, తలంబ్రాల పంపిణీ సమయంలో ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా కౌంటర్ల సంఖ్యను మరింతగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీరామనవమి నాడుకల్యాణం తిలకించే భక్తుల కోసం ఎల్ఈడీ స్క్రీన్లను మరింతగా పెంచాలని అన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, ముత్యాల



మిథిల స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

తలంబ్రాలు సీఎం దంపతులు సమర్పించే విధానంను స్థానిక అధికారులు, వైదిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఆలయంలో సీఎం పూజలు నిర్వహించి అనంతరం ముత్యాల తలంబ్రాలు పట్టువస్త్రాలను కల్యాణ మండపంకు తీసుకురావడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

అధికారుల తీరుపై అసహనం

ప్రధాన సెక్టార్ల పరిధిని పెంచాలని గతంలో సూచించినా ఆ పని ఇంకా పూర్తికాక పోవడం పట్ల జిల్లా కలెక్టర్ జితేష్‌వి పాటిల్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ఇందుకు సంబంధించిన పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ నెల 5 లోపు పనులను ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేసి మిథిలా స్టేడియంలో కనీస మౌళిక సదుపాయాలు, సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్న క్రమంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, అన్ని శాఖల పనులు ఈ నెల 5వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం గిరిజన మ్యూజియంను, గోదావరి నదీ తీరంలో రివర్‌సైడ్ క్యాంపును కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎస్పీ రోహిత్‌రాజు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి క్రాంతి కుమార్, ఐటీడీఏ పీవో బి.రాహుల్, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఆర్డీవో దామోదర్‌రావు ఉన్నారు.

మిథిలస్టేడియంలో పొగమంచు ఏర్పాట్లు

కల్యాణం తిలకించడానికి వచ్చే భక్తులకు వేసవి తాపం నుంచి సేద తీరేందుకు జిల్లా కలెక్టర్ జితేష్‌వి పాటిల్ చొరవతో తొలిసారిగా మిథిలస్టేడియంలో పొగమంచు ఏర్పాటు చేస్తున్నారు. ఫినొలెక్స్ ప్లాసాన్ ఇండస్ట్రీస్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో మిథిలా స్టేడియంలోని సుమారు లక్ష చదరపు అడుగుల్లో 800 ఫాగర్స్‌ను సుమారు 20 అడుగుల ఎత్తులో (పొగను వెదజల్లే పరికరాలు) 5000 మీటర్ల పైపు ద్వారా ఏర్పాటు చేస్తున్నారు. ఒక ఫాగర్ ద్వారా రెండువైపులా మూడు మీటర్ల వ్యాసార్థంలో పరిసరాలు చల్లబడే అవకాశం (మిగతా 6వ పేజీలో)

భద్రాద్రి బాటలో ప్రముఖులు

- ఈ సారి కల్యాణానికి భారీగా వీవీఐపీ, వీఐపీల తాకిడి
- మిథిల స్టేడియంలో ప్రధాన సెక్టార్ల పరిధి పెంపు
- వీవీఐపీ సెక్టార్‌లో 100, వీఐపీ సెక్టార్‌లో 250 అదనంగా పెంపు

భద్రాచలం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే సీతారాముల కల్యాణంకు ఈసారి వీవీఐపీ, వీఐపీల తాకిడి అధికంగా ఉండే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. గత దశాబ్దకాలంలో రామయ్య కల్యాణంకు సీఎంగా కేసీఆర్ రెండుసార్లు మాత్రమే రావడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గత ఏడాది శ్రీరామనవమికి ఎంపీ ఎన్నికల కోడ్ ఉండటంతో సీఎం రాలేదు. ఈసారి నవమికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి రానున్నట్లు అధికార వర్గాల ద్వారా సమాచారం. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వంలోని అధిక శాతం మంది మంత్రులతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఎఎస్, ఐపీఎస్ అధికారులు, న్యాయమూర్తులు అధికంగా వచ్చే అవకాశాలున్నాయని అధికార వర్గాలు అంచనా (మిగతా 6వ పేజీలో)



కల్యాణ మండపానికి వార్నిష్ వేస్తున్న దృశ్యం

తుది దశకు రామయ్య కల్యాణ పనులు

- నేడు ధ్వజపట మండల లేఖనం

భద్రాచలం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసంతపక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ తేదీన శ్రీరామనవమిని పురస్కరించుకున్న సీతారాముల కల్యాణానికి చేపట్టిన పనులు తుది దశకు చేరుకుంటున్నాయి. ఇంకా కేవలం మూడు రోజులే మిగిలి ఉండటంతో అధికారులు ఏర్పాట్లలో వేగం పెంచారు. ఈ నెల 5వ తేదీలోపు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్‌వి పాటిల్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే మిథిలా స్టేడియంలో చలువ పందిళ్లు, సెక్టార్ల ఏర్పాటు (మిగతా 6వ పేజీలో)



రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న డీఎస్వో చందన్‌కుమార్

సన్న బియ్యం సంబురం

- తొలిరోజు 400 రేషన్‌షాపుల్లో 600 మెట్రిక్ టన్నుల పంపిణీ
- ప్రారంభించిన ఎమ్మెల్యేలు, నగర మేయర్

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తెల్లరేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీని మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. తొలిరోజు 400 రేషన్ దుకాణాల్లో 600 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారులు తెలిపారు. ఉగాది నాడు రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి సన్న బియ్యం పంపిణీని ప్రారంభించగా మంగళవారం ఖమ్మం జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీని చేపట్టారు. సత్తుపల్లిలో అక్కడి ఎమ్మెల్యే రాగమయి, వైరాలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్, ఖమ్మం నగరంలో ఖమ్మమ మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. మొత్తంగా సన్నబియ్యం పంపిణీతో రేషన్ దుకాణాల వద్ద జనసందోహం కనిపించింది.

చర్చికాంపౌండ్‌లో ప్రారంభించిన మేయర్

ఖమ్మం నగరంలోని చర్చికాంపౌండ్‌లో 16వ నెంబర్ రేషన్ షాప్‌లో మంగళవారం సన్నబియ్యం (మిగతా 6వ పేజీలో)

నేటి నుంచి జేఈఈ మెయిన్ పరీక్షలు

- ఖమ్మంలో 4 పరీక్ష కేంద్రాలు

ఖమ్మం ఖానాపురం హవేలి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్, బీఆర్క్ రెండో విడత పరీక్షలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా కో-ఆర్డినేటర్ ఆర్. పార్వతీరెడ్డి మంగళవారం తెలిపారు. ఖమ్మం జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, మొదటి మూడు రోజులకు మొత్తం 3,095 మంది హాజరు కానున్నారని తెలిపారు. బొమ్మా, విజయ ఇంజనీరింగ్ కాలేజ్, ఎస్‌బీఐటీ పాకబండ బజార్, శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఏప్రిల్ 2, 3, 4, 7, 8, 9వ తేదీల్లో జేఈఈ మెయిన్, బీఆర్క్ పరీక్షలు ఉంటాయని తెలిపారు. ఈ నెల 7, 8, 9వ తేదీల్లో జరిగే పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల వివరాలను ఎన్‌టీఏ 5న తెలియపరుస్తుందని అన్నారు. మొదటి షిఫ్ట్ ఉదయం 9గంటల నుంచి 12 వరకు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6 వరకు ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రానికి ఒక గంట ముందు చేరుకోవాలని, ఉదయం పరీక్షకు 8.30 గంటలకు, మధ్యాహ్నం పరీక్షకు 2.30గంటలకు పరీక్ష కేంద్రం గేట్లు మూసివేస్తారని తెలిపారు.

సమగ్ర విత్తన చట్టాన్ని తీసుకురావాలి

జూలూరుపాడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రైతులకు సమగ్ర విత్తనపు చట్టాన్ని తీసుకురావాలని రైతుసంఘాలు, రాజకీయ పార్టీలు ఎన్నో ఏళ్లగా పోరాటాలు నిర్వహిస్తున్నప్పటికి కేంద్ర ప్రభుత్వం దాన్ని అమలుచేయకపోవటంతో బహుళజాతి కంపెనీలు రైతులను మోసగిస్తున్నాయని సంయుక్త కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లమల్ల వెంకటేశ్వరరావు ఆరోపించారు. మంగళవారం జూలూరుపాడు మండలంలోని వినోభానగర్ గ్రామాన్ని ఆయన సందర్శించి ఇటీవల మృతి చెందిన గిరిజన రైతు జర్పుల కృష్ణ కుటుంబాన్ని పరామర్శించారు. భార్య రాజ్యలక్ష్మి, ఇద్దరు పిల్లలను ఆయన ఓదార్చారు. రైతు మృతి చెందడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సమగ్ర విత్తన చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని అమలు చేయకపోతే కనీసం రాష్ట్ర ప్రభుత్వం అయిన రాష్ట్ర పరిధిలో ఒక చట్టాన్ని తీసుకురావాలని కోరారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మొక్కజొన్న విత్తన కంపెనీల యాజమాన్యాలు దళారుల ప్రమేయంతో రైతులను (మిగతా 6వ పేజీలో)

- కృష్ణ కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- రైతులను దగా చేస్తున్న మొక్కజొన్న విత్తన కంపెనీలు
- సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ నేత నల్లమల్ల



మాట్లాడుతున్న నల్లమల్ల వెంకటేశ్వరరావు



ఆధ్యాత్మిక ప్రాంతాల విస్మరణ

- జటాయువు త్యాగాన్ని ఉష్ణగుండాలను మరిచారు..
- దర్శనీయ స్థలాలపై ప్రభుత్వాల శీతకన్ను

7

'ఆగ్రో' ఇండస్ట్రీస్ ఎప్పుడో!?

- జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ఎన్నో అవకాశాలు
- విభిన్న పంటలు సాగవుతున్నా ఏర్పాటు నామ మాత్రమే
- బడ్జెట్ ప్రతిపాదనలకే పరిమితమైన వైనం
- పూర్తిస్థాయి ప్రణాళికలపై స్పష్టత కరువు
- ఆయిల్‌పామ్ పరిశ్రమలో మాత్రం ముందంజ

ఖమ్మం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాను వ్యవసాయాధారిత పరిశ్రమల జిల్లాగా ప్రకటించినా అందుకు తగ్గ కార్యాచరణ మాత్రం ఇంతవరకు పూర్తి స్థాయిలో చేపట్టలేదు. జిల్లాలో ఏర్పాటు చేయబోయే పరిశ్రమలపై ఇంకా స్పష్టత రాలేదు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు కూడా రూపొందించలేదు. తెలంగాణలో విభిన్న పంటలకు నిలయంగా ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుతో విస్తరించి ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనేక రకాల వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే సింగరేణి, నవభారత్, కేటీపీఎస్, ఐటీసీ, హెవీవాటర్ ప్రాజెక్టు, ఎన్ఎండీసీ వంటి భారీ పరిశ్రమలతో పారిశ్రామికంగా ముందంజలో ఉన్నా వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటులో మాత్రం ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదు. ఒక్క ఆయిల్‌పామ్ పరిశ్రమల ఏర్పాటులో మాత్రం ఉమ్మడి జిల్లా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది.

మిర్చి సాగులో ప్రత్యేక స్థానం

ఉమ్మడి జిల్లాలో భిన్న రకాల పంటలు సాగవుతున్నాయి. వాటిలో ముఖ్యంగా వరి, మిర్చి, పత్తి ముఖ్యమైనవి. జిల్లాలో సుమారు లక్షా 50వేల ఎకరాల్లో రైతులు మిర్చి సాగుచేస్తున్నారు. ఇక్కడ పండే మిర్చి దేశ, విదేశాలకు ఎగుమతి అవుతుంది. అయితే ఉమ్మడి జిల్లాలోనే మిర్చి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తే స్థానికంగా రైతులకు గిట్టుబాటు ధరతోపాటు వేలాదిమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. జిల్లాలో ముదిగొండలో మాత్రమే చైనాకు చెందిన సంస్థ మిర్చి ఆధారిత పరిశ్రమ ఏర్పాటు చేసింది. రెండు జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధులు మిర్చి సాగయ్యే ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు కల్పించి పెట్టుబడిదారులను ఆహ్వానిస్తే మిర్చి రైతులకు మేలు జరిగే అవకాశం ఉంది. స్వయం సహాయక సంఘాలు, రైతుసంఘాలను సమన్వయం చేసి మిర్చి ఆధారిత చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రభుత్వం నుంచి అవగాహన కల్పిస్తే జిల్లాలో మిర్చి ఆధారిత పరిశ్రమలు భారీగా వచ్చే అవకాశం ఉంది. జిల్లాకు సరిహద్దున ఏపీలోని బందరు, కాకినాడ, విశాఖ పోర్టులు కూడా దగ్గరగా ఉండడంతో జిల్లానుంచి నేరుగా దేశ, విదేశాలకు ఎగుమతులు చేసే సౌలభ్యం లభించనుంది. అలాగే వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు (మిగతా 6వ పేజీలో)

రాయితీ ఇచ్చినా స్పందన అంతంతే...

- సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్‌పై ఆసక్తి కరువు
- 3,115 మందికి 471 మంది ఫీజు చెల్లింపు
- 25శాతం తగ్గించినా పెదవి విరుపు

6

టమాట ధమాల్..

- నష్టపోయిన రైతులు
- రవాణా ఖర్చులు కూడా రాని వైనం
- తోటల్లో పశువులను మేపుతున్న అన్నదాతలు

WALK-IN INTERVIEW

రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న బల్క్‌డ్రగ్ పరిశ్రమ ప్రొడక్షన్ విభాగంలో పనిచేయుటకు ఈ క్రింది అర్హతలు, శారీరక దారుఢ్యం మరియు మంచి ఆరోగ్యం గల అభ్యర్థులు కావలెను.

2021 to 2024 PASSED OUT & 2025 PURSUING CANDIDATES

Job Title	Qualification		Stipend (P.M)
Trainee Helper	S.S.C , Inter / ITI (Fitter, Electrical, Diesel Mechanic)	Age 21 - 25 years	Rs. 15,000/-
Trainee Supervisor/ Graduate Apprentice	B.Sc (Chemistry) మొదటి 2 సంవత్సరములు అన్ని సబ్జెక్టులు పాసై 3వ సంవత్సరంలో సబ్జెక్టులు మిగిలిన వారు కూడా అర్హులు.		Rs. 18,000/-
	B.Pharmacy B.Tech (Chemical/Mechanical/ Instrumentation/EIE) మొదటి 3 సంవత్సరములు అన్ని సబ్జెక్టులు పాసై 4వ సంవత్సరంలో సబ్జెక్టులు మిగిలిన వారు కూడా అర్హులు.		Rs. 20,000/-
	M.Sc (Organic Chemistry/ Analytical Chemistry /Micro Biology)		Rs. 22,000/-
	M.Pharmacy (Pharmaceutical Chemistry/ Analysis/QA/RA)		Rs. 24,000/-

పై అర్హతలు గల అభ్యర్థులు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు జిరాక్స్ కాపీలను తీసుకొని ఈ క్రింది ప్రదేశాలలో జరుగు ఇంటర్వ్యూకు హాజరు కాగలరు. ఎంపిక కాబడిన అభ్యర్థులు షిఫ్ట్‌లలో పనిచేయవలసియుండును.

03-04-2025	KLR PHARMACY COLLEGE Near Rathicheruvu, PALVANCHA, Khammam Dist.
04-04-2025	DHANAVANTHARI INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES Sujatha Nagar, KOTHAGUDEM, Khammam Dist.
05-04-2025	SREENIDHI DEGREE COLLEGE Ambarupeta Road, MADHIRA, Khammam Dist.
07-04-2025	MAX INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES Velugumatla, KHAMMAM.

Interview Time : 9:00 am to 12:00 noon

సదుపాయములు: 1.బ్యాచ్‌లర్స్‌కు (పురుషులు) ఉచిత వసతి 2.ఉచిత యూనిఫాం 3.అర్హులైన వారికి PF, ESI ఇవ్వబడును 4.భోజన ఖర్చులో రాయితీ

Issued by : SSM Manpower Services
Cyberhills Colony, PJR Nagar, Gachibowli, Hyderabad, Telangana.
Contact : 08694-257001

రాష్ట్ర బాస్కెట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడిగా విజయసారథి



ఖమ్మం స్పోర్ట్స్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, డీఎస్పీ విజయసారథి ఎన్నికయ్యారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర బాస్కెట్‌బాల్ సంఘ ఎన్నికలలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా జిల్లా బాస్కెట్‌బాల్ సంఘ ఎన్నికలకు త్వరలో నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు తెలిసింది. రాష్ట్ర సంఘంలో ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన విజయసారథిని జిల్లాలోని పలు క్రీడా సంఘాల బాధ్యులు అభినందించారు.

హెచ్‌సీయూ భూముల స్వాధీనం ఆపాలి

» మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల భూముల్ని రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అమ్ముకోవాలని చూడటం దుర్మార్గపు చర్య అని, భవిష్యత్ తరాల ఉన్నత విద్యపై తీవ్ర ప్రభావం పడుతుందని, అడ్డగించిన విద్యార్థులపై నిర్బంధాలు దుర్మార్గపు చర్య వంటిదని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఖమ్మం పార్టీ కార్యాలయం నుంచి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని తొలగించిన వృక్షాల ప్రాంతాలను తిరిగి సెంట్రల్ వర్సిటీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల అక్రమ అరెస్టులు ఆపాలని, కేసుల్ని ఉపసంహరించుకోవాలని కోరారు. గత రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేటర్ కంపెనీలకు ప్రభుత్వ భూములను అమ్మకాలు చేసిందన్నారు. ఆదే సమయంలో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ గోల చేసిందని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా ఆదే పని చేసిందని దుయ్యబట్టారు. అవసరమైతే విద్యార్థులు, పౌర సమాజం, విద్యార్థి సంఘాలు ఐక్యంగా హెచ్‌సీయూ భూములను కాపాడేందుకు పోరాటాలు చేస్తామని పోటు రంగారావు హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో మాన్యుసూక్త హోమం

» మూడోరోజుకు చేరిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



యాగశాలలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఎర్రుపాలెం, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం మూడోరోజుకు చేరకున్నాయి. ఉదయంకాలం నుంచే యాగశాలలో ప్రాతఃకాల అర్చనలు, అనుష్టానములు, మండపారాధనలు నిర్వహించారు. రుగ్వేద పరంపరలోని మాన్యుసూక్త హోమం నిర్వహించారు. నవరాత్రుల్లో మూడోరోజు మంగళ ప్రదమైన సామూహిక సౌభాగ్యలక్ష్మి వ్రతం నిర్వహిచారు. అనంతరం డప్పువాయిద్యాలు, కోలాట నృత్యాలు మధ్య శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారు గిరిప్రదక్షిణ చేశారు. ఈకార్యక్రమంలో ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.వి జయకుమారి, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహనశర్మ, వేదపండితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాయితీ ఇచ్చినా.. స్పందన అంతంతే..



» సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్‌పై ఆసక్తి కరువు
» 3,115 మందికి 471 మంది మాత్రమే ఫీజు చెల్లింపు
» 25శాతం తగ్గించినా దరఖాస్తుదారుల పెదవి విరుపు
» ఇంటి నిర్మాణం సమయంలో చెల్లిస్తామంటున్న ప్రజలు
» దరఖాస్తుల పెండింగ్ తో ఫీజులు చెల్లించిన వారిలో ఆందోళన
» వెంటనే పరిష్కరిస్తామంటున్న అధికారులు

సత్తుపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లే అవుట్ రెగ్యులరైజేషన్ పథకంపై సత్తుపల్లి మునిసిపాలిటీలో స్పందన కనిపించటం లేదు. ఎల్‌ఆర్‌ఎస్ తమ పాలిట భారంగా మారిందని సామాన్య, మధ్యతరగతి వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 2020లో దరఖాస్తు చేసుకున్న వారికి 25శాతం రాయితీ ప్రకటించినా ఆర్థిక సంవత్సరం (మార్చి 31) వరకూ ఆశించిన స్థాయిలో దరఖాస్తు దారులు ఫీజు చెల్లించలేదు.

3,689 దరఖాస్తులు

2020లో అప్పటి ప్రభుత్వం అక్రమ లే అవుట్ల లో స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు ఎల్‌ఆర్‌ఎస్ ప్రవేశపెట్టింది. స్థలాలు కొనుగోలు చేసిన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది. అప్పట్లో అధికారులు ఖాళీ స్థలం కలిగి ఉన్న యజమానులందరూ దరఖాస్తు చేయాలని ప్రచారం చేయటంతో సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలో 3,689 మంది రూ.వెయ్యి చొప్పున చెల్లించి దరఖాస్తు చేశారు. అప్పట్లో విపక్షాల నుంచి ఖాళీ స్థలాల యజమానుల నుంచి వ్యతిరేకత రావటంతో అప్పట్లో ఈ కార్యక్రమం పక్కన పెట్టారు. ప్రస్తుత ప్రభుత్వం దీనిని అమలు చేస్తోంది. ఈ క్రమంలో 2020లో దరఖాస్తు చేసిన వారు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజును మార్చి 31 తేదీలోపు చెల్లిస్తే 25శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రకటించింది. ఆ మేరకు మునిసిపల్ అధికారులు దరఖాస్తు దారులకు ఫోన్లు చేసి మరీ ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించాలని సూచించారు. కాని సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలో 3,689 దరఖాస్తులకుగాను 3,115 దరఖాస్తుదారులకు ఫీజు సమాచారం ఇచ్చారు. వీరిలో ప్రభుత్వం విధించిన తుది గడువు (మార్చి 31) నాటికి కేవలం 471 మంది మాత్రమే ఫీజు చెల్లించారు. ఫీజు చెల్లించిన వారిలో 389 మందికి రెగ్యులర్ అయినట్లు ప్రొసీడింగ్స్ వచ్చాయి. 82 దరఖాస్తుదారుల స్థలాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్నాయి.

పెండింగ్‌తో ఆందోళన

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించిన వారిలో 82 దరఖాస్తులు ఎల్-2, ఎల్-3 స్థాయిలో పెండింగ్‌లో ఉండటంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. 2020లో దరఖాస్తు చేసిన సమయంలో అధికారులు సదరు స్థలాలను పరిశీలించి ఎల్‌ఆర్‌ఎస్‌కు అర్హత ఉన్న దరఖాస్తులను ఎంపిక చేశారు. వారికే ఫీజు చెల్లించాలని సమాచారం ఇచ్చారు. ఫీజు చెల్లించిన తరువాత కొందరికి ప్రొసీడింగ్ రాకుండా వివిధ స్థాయిలో పెండింగ్ చూపటంతో ఆందోళన చెందుతున్నారు. ఒకే సర్వే నెంబర్‌లో స్థలాలకు కొన్నింటికీ ప్రొసీడింగ్స్ వచ్చినా కొన్నింటికీ ఎల్-2, ఎల్-3 స్థాయిలో పెండింగ్ చూపుతున్నాయని దరఖాస్తుదారులు చెపుతున్నారు. ఎల్-2 టౌన్‌ప్లానింగ్ వద్ద, ఎల్-3 కమిషనర్ స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయి.



ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లిస్తున్న ప్రజలు

దరఖాస్తు దారుల అసంతృప్తి

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియపై దరఖాస్తు దారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల క్రితం తాము కొనుగోలు చేసిన స్థలాలకు ఇప్పుడు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు వసూలు చేయటం ఏమిటంటూ మండిపడుతున్నారు. పాతిక, 30 ఏళ్ల క్రితం తాము ఇళ్ల స్థలం కొనుగోలు చేస్తే ఇప్పుడు రోడ్డు 20 అడుగులే ఉందంటూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న యజమానుల నుంచి అయిదు అడుగుల చొప్పున స్థలం మునిసిపాలిటీ తీసుకుంటోంది. ఈ మేరకు స్థతం తగ్గించి ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడింగ్స్ జారీ చేస్తున్నారు. దశాబ్దాల క్రితం ఒక రోడ్డులో ఇరువైపులా ఇళ్లు నిర్మించుకోగా ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలం యజమానికి మాత్రం ఇప్పుడు రోడ్డు 30 అడుగులు ఉండాలంటూ అయిదు నుంచి ఎనిమది అడుగుల స్థలం యజమాని నుంచి తీసి ఎల్‌ఆర్‌ఎస్ చేస్తున్నారు. మిగిలిన రోడ్డు మొత్తం ప్రస్తుతం వెడల్పు చేసే అవకాశం లేక పోయినా స్థలం యజమాని రోడ్డుకు స్థలం వదిలేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఎల్‌ఆర్‌ఎస్ కట్టకుండా ఇల్లు కట్టుకునే సమయంలో చూద్దామనుకుంటున్నారు.

పెండింగ్ వెంటనే పరిష్కరిస్తాం

ఎల్-2, ఎల్-3 స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించి ప్రొసీడింగ్స్ జారీ చేస్తామని సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్ నరసింహ చెప్పారు. తన స్థాయిలో ఏడు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వీటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. టౌన్ ప్లానింగ్ స్థాయిలో ఉన్న దరఖాస్తులు కూడా సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

టమాట.. ఢమాల్..

» నష్టపోయిన రైతులు
» రవాణా ఖర్చులూ రాని వైనం

ఏన్కూరు, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మార్కెట్‌లో ధర లేక టమాట రైతుకు కన్నీరే మిగిలింది. వాణిజ్య పంటలు పత్తి, మిర్చి పండించి నష్టపోయిన రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందాలనే ఆశతో కూరగాయల సాగువైపు మళ్లినా రైతులకు నిరాశే మిగిలింది. ఈఏడాది ఏన్కూరు, రేపల్లేవాడ, హిమాంనగర్, రాజులపాలెం, నాచారం, గార్లొడ్డు, జన్నారం గ్రామాల్లో టమాట పంటను ఎక్కువగా వేశారు. ఎకరానికి రూ.50నుంచి 60వేల వరకు పెట్టుబడులు పెట్టారు. తీరా పంట చేతికి వచ్చే సమయానికి ధర లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు కోత కూలీల ఖర్చులు రాక దిక్కుతోచని స్థితిలో రేపల్లేవాడ గ్రామానికి చెందిన బానోతు సోమ్లా అనే రైతు తన ఎకరం న్నర టమాట తోటను పశువుల మేతగా ఉపయోగిస్తున్నాడు. ఖమ్మం, కొత్తగూడెం మార్కెట్‌కు తీసుకెళ్లినా రవాణా ఖర్చులు కూడా రావడంలేదని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. 25కిలోల బాక్సు రూ.150కూడా రావడంలేదని వాపోతున్నారు. దిగుబడి ఉన్నప్పుడు ధర ఉండడంలేదని, ధర ఉన్నప్పుడు దిగుబడి ఉండడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



పశువుల మేతగా టమాట తోట

'భూ భారతి'తోనే సమస్యల పరిష్కారం

» తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్న భూ భారతి చట్టంతోనే భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి దోహదపడుతుందని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి అభిప్రాయపడ్డారు. మంగళవారం ఖమ్మంలోని ఎన్నెస్పీ గెస్టుహౌస్‌లో గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ భారతి చట్టం సమర్థవంతంగా నిర్వహించుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం 10,954 గ్రామ పాలన అధికారుల పోస్టులను మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తిస్థాయిలో రెవెన్యూ శాఖను బలోపేతం చేయడానికి ముందడుగు వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ వెంకన్న, మంగిలాల్, బుచ్చయ్య, కోట రవికుమార్, రమేష్ పాక, ఫూల్‌సింగ్ చౌహన్, శ్రీనివాస్ శంకర్రావు, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

'ఆగ్రో' ఇండస్ట్రీస్ ఎప్పుడో!?

(5వ పేజీ తరువాయి)

గన్నవరం ఎయిర్‌పోర్టు కూడా అందుబాటులో ఉంది.

పత్తి పరిశ్రమలతో ఉపాధి..

అదిలాబాద్, వరంగల్ జిల్లాతో సమానంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పత్తి భారీగా సాగవుతోంది. జిల్లాలో సుమారు 3లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతున్నా పత్తి జిన్నింగ్ మిల్లులు చాలా తక్కువ సంఖ్యలోనే ఉన్నాయి. అదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో వందల సంఖ్యలో జిన్నింగ్ మిల్లలుంటే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 20వరకే ఉన్నాయి. జిన్నింగ్ మిల్లులు లేకపోవడంతో జిల్లాలో ఉత్పత్తి అయ్యే పత్తిని వ్యాపారులు మహారాష్ట్ర, ఏపీ, తమిళనాడుకు తరలిస్తున్నారు. ఇక్కడే జిన్నింగ్ మిల్లులు ఏర్పాటుచేస్తే రవాణా చార్జీల భారం తగ్గి రైతులకు అదనంగా ధర లభించే అవకాశం ఉంది. జిన్నింగ్ మిల్లులే కాకుండా పత్తినుంచి దారం తీసే స్పిన్నింగ్ మిల్లుల ఏర్పాటుకు కూడా ఇక్కడ అవకాశాలు ఉన్నాయి. ఇక్కడ తయారయ్యే ఉత్పత్తులను నేరుగా దేశ, విదేశాలకు ఎగుమతి చేసే అవకాశం ఉంది.

రైస్ మిల్లుల ఏర్పాటు

ఉమ్మడి జిల్లాలో సుమారు 4లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. రెండు సీజన్లు కలిపి 10నుంచి 15లక్షల మె.టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతోంది. అయితే జిల్లాలో ధాన్యం మిల్లులు ఇతర జిల్లాలతో పోల్చితే తక్కువగానే ఉన్నాయి. సీఎంఆర్ ధాన్యం ఆడించేందుకు ఇతర జిల్లాలకు పంపిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పారాబాయిల్డ్ రైస్‌మిల్లులు ఏర్పాటుచేయాలని గతంలో ప్రతిపాదన జరిగింది. ఖమ్మం, కొత్తగూడెంలో ఇండస్ట్రియల్ పార్కుల్లో రైస్‌మిల్లులు పెట్టాలని ప్రభుత్వం భావించింది. గ్రామాలు, మండలాల్లో చిన్న, మధ్య తరహా రైస్‌మిల్లుల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉంది. స్వయం సహాయకసంఘాల ద్వారా కూడా రైస్ మిల్లులు మంజూరుచేస్తే నిర్వహణ సులభతరం అవుతుంది.

పండ్లు, కూరగాయల ఆధారంగా..

ఉమ్మడి జిల్లాలో మామిడి, జీడిమామిడి, జామ, అరటి, సీతాఫలం, నేరుడ వంటి పండ్ల తోటలతో పాటు టమాట, వంగ, బెండ, బీర, దోస, పచ్చిమిర్చి, సొర, దొండ, తదితర కూరగాయల సాగుకూడా వేల ఎకరాల్లో ఉంది. కూరగాయల నుంచి కూడా ఉప ఉత్పత్తులు చేసుకునే సౌలభ్యం ఉంది. మామిడి నుంచి ఉప ఉత్పత్తులతో ఇతరజిల్లాల్లో అనేకచోట్ల చిన్నతరహా పరిశ్రమలతో ఉపాధి పొందుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఇలాంటి పరిశ్రమలపై ఎలాంటి ప్రణాళికలు లేవు. టమాట భారీగానే సాగవుతుండడంతో సాస్ వంటి ఉత్పత్తులకు అవకాశం ఉంది. మహిళ సంఘాలకు ఇప్పటి వరకు ఈ ఉత్పత్తుల పరిశ్రమలపై అవగాహనలేదు. ప్రస్తుతం ఇర ప్రాంతాల్లో మామిడి, జామ, అరటి, సీతాఫలం, నేరేడు వంటి పండ్లతో ఐస్ క్రీంలు కూడా తయారు చేస్తున్నారు. జిల్లాలోనూ ఇలాంటి వ్యవసాయాధారిత పరిశ్రమలకు అనేక అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉమ్మడి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రులు వ్యవసాయాధారిత పరిశ్రమలపై దృష్టి పెట్టి వర్కుషాపు నిర్వహించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తే వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటులో జిల్లా ముందుండే అవకాశం ఉంది.

ఆయిల్‌పామ్ పరిశ్రమలో ముందంజ..

ఆయిల్‌పామ్ పరిశ్రమల ఏర్పాటులో మాత్రం మంత్రి తుమ్మల నాగేశ్వరారవు కృషితో ఉమ్మడి జిల్లా ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిచింది. తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఇరు జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగుతో పాటు అశ్వారావుపేట అప్పారావుపేటలో ఆయిల్‌పామ్ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. కొత్తగా రూ.87కోట్లతో వేంసూరు మండలం కల్లూరిగూడెంలో మరో అయిల్‌ఫామ్ పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన జరిగింది. ప్రైవేటులోనూ కొణిజర్ల మండలంలో గోద్రేజ్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ పరిశ్రమ ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. ఇక్కడ గోద్రేజ్ సంస్థ సీడ్ డెవలప్‌మెంట్‌తో పాటు రీఫైన్డు ఆయిల్ పరిశ్రమల ఏర్పాటుకు మరో 50 ఎకరాలవరకు స్థలం కావాలని అడుగుతుంది. ప్రభుత్వం నుంచిస్థలం ఇవ్వకపోవడంతో పరిశ్రమ ఏర్పాటుపనులు నత్తనడకన సాగుతున్నాయి.

భద్రాద్రి బాటలో ప్రముఖులు

(5వ పేజీ తరువాయి)

వేస్తున్నాయి. దీంతో ఇందుకోసం ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇప్పటి వరకు సీఎం సెక్టారు పరిధి(వీవీఐపీ)లో 150 మంది కూర్చొనేందుకు అనువుగా ఉండగా దాని పరిధిని అదనంగా వంద పెంచడంతో 250కి చేరింది. అలాగే వీఐపీ సెక్టారు గతంలో 250 ఉండగా ఈసారి అదనంగా 250 పెంచడంతో 500లకు చేరింది. ఇదిలా ఉండగా రూ.7,500 విలువ గల ఉభయదాతల టికెట్లు 1000 ఉండగా వాటిని 775కి కుదించారు.

ఏటా పెరుగుతున్నాయి..

మిథిల స్టేడియంలో రామయ్య కల్యాణంను 31 వేల మంది తిలకించేందుకు వెసులుబాటు ఉంది. ఇందులో ఇందులో 15,635 మంది సెక్టార్ల టికెట్ల కొనుగోలు ద్వారా కల్యాణం తిలకించేందుకు వీలుంది. అయితే సుమారు 15 వేల మంది మిథిల స్టేడియంలోని ఉచిత సెక్టారు నుంచి స్వామి వారి కల్యాణం తిలకిస్తారు. కాగా ప్రతి ఏటా వీవీఐపీ, వీఐపీ సెక్టార్ల పరిధి పెంచుతుండటంతో ఆ ప్రభావం ఉభయదాతల సెక్టారుపై పరోక్షంగా పడుతోంది. 2017లో జరిగిన కల్యాణం సమయంలో సైతం సీఎం సెక్టారు పరిధి పెంచేందుకు ఆనాడు వీఐపీ సెక్టార్‌లో 150 టికెట్ల కు కోత విధించారు. ఈసారి సైతం వీవీఐపీ, వీఐపీ సెక్టార్ల పరిధి పెంచి ఉభయదాతల పరిధిని కుదించడం పట్ల ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి.

కల్యాణ వేడుక.. కావాలి పండుగ

(5వ పేజీ తరువాయి)



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్

ఉంటుందని సంబంధిత సిబ్బంది తెలిపారు. ఇందుకోసం బోర్ పాయింట్ నుంచి ప్రత్యేకంగా పైపులైన్ల ద్వారా నీటిని వినియోగించనున్నారు. ఒక గంటకు 16 వేల లీటర్ల నీరు వినియోగించనున్నారు. గంటకు పది నుంచి 20 నిమిషాల పాటు ఎండ తీవ్రతను బట్టి పొగమంచును ఆన్ చేయడం, ఆఫ్ చేయడం చేస్తుంటారు.

ఇదిలా ఉండగా గోదావరి నదీ తీరంలో ఇటీవల నిర్వహించిన ఏరు ఫెస్టివల్‌లో ఏర్పాటు చేసిన రివర్‌సైడ్ క్యాంపులో ఇప్పటికే పొగమంచు విధానంను ఏర్పాటు చేశారు. దీనిని కలెక్టర్ జితేష్‌వి పాటిల్, ఇతర అధికారులు స్వయంగా పరిశీలించారు. ఎండ వేడిమి పెరుగుతుండటంతో రివర్‌సైడ్ క్యాంపుపైన తాటాకు పందిళ్లను సైతం సహజసిద్ధంగా ఉండేలా ఏర్పాటు చేస్తున్నారు. ఇదిలా ఉండగా రివర్ సైడ్ క్యాంపులో పొగమంచు విధానం ఒక రోజులో ఏర్పాటు చేయడం జరిగిందని మిథిలా స్టేడియంలో రెండు రోజుల్లో ఈ విధానం అందుబాటులోకి తేనున్నట్లు ఫినోలెక్స్ జిల్లా కోఆర్డినేటరు నరసింహారావు తెలిపారు.

సమగ్ర విత్తన చట్టాన్ని తీసుకురావాలి

(5వ పేజీ తరువాయి)

మభ్యపెట్టి పంటలను సాగుచేయించి మోసం చేస్తున్నాయని తెలిపారు. మృతి చెందిన గిరిజన రైతు కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియాను కంపెనీ యాజామాన్యం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతు కుటుంబానికి న్యాయం జరిగే వరకు గ్రామంలోని రైతులు తమ పంటను కంపెనీకి ఇవ్వవద్దని తెలిపారు.

రైతు కుటుంబానికి న్యాయం చేసే వరకు పార్టీలు, రైతు సంఘాలకు అతీతంగా ప్రత్యక్ష పోరాటం నిర్వహిస్తామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలసి కంపెనీల దోపిడీ, గిరిజన రైతు మృతి తదితరాలను విన్నవిస్తామని అన్నారు. రైతులకు ముందస్తు పెట్టుబడి ఆశచూపి వారిని మభ్యపెట్టి మొక్కజొన్న పంటలను సాగుచేయించి వడ్డీతో సహా రైతుల వద్ద నుంచి వసూళ్లు చేస్తున్నారని, దీంతో రైతులకు ఏమి మిగలకపోవడంతో నష్టపోతున్నారని అన్నారు. రైతులకు ఎలాంటి అగ్రిమెంట్ చేయకుండానే కంపెనీ యాజామాన్యం, దళారులు దోచుకుంటున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కంపెనీల విధానలతో రైతులు నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి జిల్లా వ్యవసాయ శాఖాధికారి బాబురావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు రామయ్య కల్యాణ పనులు

(5వ పేజీ తరువాయి)



తుది దశకు చేరిన సెక్టార్ల ఏర్పాటు

చేశారు. కల్యాణ మండపానికి వార్నిష్ వేసే పనులు కొనసాగుతున్నాయి. ఫ్యాన్లను సెక్టార్లలో ఏర్పాటు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ధ్వజపట మండల లేఖనం నిర్వహించనున్నారు. రామయ్య కల్యాణానికి జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమెరికాలోని ఎయిడ్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో ఐదు క్వింటాళ్ల బియ్యం(20 బస్తాలు) అందజేశారు. మంగళవారం భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి జేడీ ఫౌండేషన్ సభ్యులు హన్సీ, సునీత, కడాలి నాగరాజు, యూసఫ్‌మియా అందజేశారు.

రామయ్యకు వెండి కలశాల సమర్పణ



కలశాలను అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి హైదరాబాద్‌లోని సైనికపురికి చెందిన శ్రీరామశర్మ సీతామహాలక్ష్మి దంపతులు, సుబ్రమణ్యం శిరీష దంపతులు తొమ్మిది వెండి కలశాలను మంగళవారం సమర్పించారు. ఒక్కో కలశం కేజీ 300 గ్రాములు ఉంటుందని వీటి తయారీకి రూ.14 లక్షలు ఖర్చయినట్లు తెలిసింది. వీటిని లాంచనంగా దేవస్థానం ఈవో ఎల్.రమాదేవికి అందజేశారు.

సన్నబియ్యం సంబురం

(5వ పేజీ తరువాయి)

పంపిణీని లాంఛనంగా ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేద ప్రజలకు పౌష్టికాహారాన్ని అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీని ప్రారంభించిందన్నారు. మన వద్ద పండించిన బియ్యాన్నే రైతులకు బోనస్ చెల్లించి వాటిని కొనుగోలు చేసి మన ప్రజలకు వాటిని అందించాలన్న ఆలోచన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. ఎక్కడా కూడా ఇలా బహుళ ప్రయోజనం చేకూరేలా ఏ ప్రభుత్వాలు ఆలోచన చేయలేదన్నారు. కార్యక్రమం లో డీఎస్వో చందన్‌కుమార్, డీటీ విజయ్‌బాబు, ఆర్ఐ వహీద్, రేషన్ డీలర్ల సంఘం నాయకులు జానిమియా, ఇబ్రహీం, విభూది నాగేశ్వరావు పాల్గొన్నారు.

748 రేషన్ దుకాణాలు..

జిల్లాలో 748 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 3,83,717 తెల్ల, 27268 అంత్యోదయ, 3 అన్నపూర్ణ కార్డుదారులు ఉన్నారు. ఈ కార్డుల ద్వారా 10,70,243 తెల్లకార్డు లబ్ధిదారులకు, 77783 మంది అత్యోదయ లబ్ధిదారులకు, 5గురు అన్నపూర్ణ కార్డు లబ్దిదారులకు ఈ నెలా73,75,868 కిలోల బియ్యం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

జిల్లా వ్యాప్తంగా 80 శాతం మాత్రమే సన్న బియ్యం ఎమ్మెల్లెస్ పా యింట్ల ద్వారా రేషన్ దుకాణాలకు సరఫరా అ య్యాయి. అవి కాస్తా మంగళవారం నాడే జి ల్లాలో 600 మెట్రిక్ టన్నుల బియ్యం లబ్ధిదారులకు అందజేశారు.. ఇటీవలె కొత్తగా వచ్చిన రే షన్‌కార్డు లబ్ధిదారులకు వచ్చేనెల నుంచి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పాత రేషన్‌కార్డుదారులకు మాత్రమే వీటిని అందిస్తున్నారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల గడువు పెంపు

» 14 వరకు పొడగింపు » కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 14 వరకు గడువు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతపై పెద్ద మొత్తంలో ప్రభుత్వం నిధులు ఖర్చు చేస్తూ రాజీవ్ యువవికాసం పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ యువకులకు సంబంధిత కార్పొరేషన్ల ద్వారా 100 శాతం సబ్సిడీ పై 50 వేల యూనిట్, 90 శాతం సబ్సిడీ పై లక్ష రూపాయల యూనిట్, 80 శాతం సబ్సిడీతో 2 లక్షల రూపాయల యూనిట్, 70 శాతం సబ్సిడీతో 4 లక్షల వరకు యూనిట్ లను యువకులు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వ సహకారం అందిస్తుందని అన్నారు. వ్యవసాయేతర పథకాలకు అభ్యర్థుల వయస్సు 21 నుంచి 55 మధ్యలో ఉండాలని, వ్యవసాయ అనుబంధ రంగాల యూనిట్ల ఏర్పాటుదారులకు 60 సంవత్సరాల వరకు సడలింపు ఇచ్చారన్నారు. 5 సంవత్సరాలకు కుటుంబం నుంచి ఒకరికి మాత్రమే ఉపాధి పథకం మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ఆదాయ ధృవీకరణపత్రం, కుల ధృవీకరణ, రవాణారంగ పథకాలకు శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్, వ్యవసాయ పథకాలకు పట్టాదారు పాస్ పుస్తకం, దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలి


వీకే7 ఓపెన్‌కాస్టును పరిశీలిస్తున్న సింగరేణి చైర్మన్ బలరాం

» సింగరేణి చైర్మన్ బలరాం

రుద్రంపూర్ (సింగరేణి), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వీకే7 ఓపెన్‌కాస్టులో నిర్ధేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు అధికారులు, కార్మికులు సమష్టి కృషి జరపాలని సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం అన్నారు. మంగళవారం వెంకటేష్‌ఖని ఓపెన్‌కాస్టు నిర్మాణ పనుల వివరాలను తెలుసుకునేందుకు ఓపెన్‌కాస్టు ఏరియాను ఆయన పరిశీలించారు. ఓపెన్‌కాస్టులో బొగ్గు ఉత్పత్తి వేగవంతం చేసే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. వీకే7కు అన్నిరకాల అనుమతులు లభించడంతో బొగ్గు ఉత్పత్తి కోసం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొత్తగూడెం ఏరియాలోని జేవీఆర్‌ఓసీ, కిష్టారం ఓసీలు బొగ్గు ఉత్పత్తిలో కీలకపాత్ర పోషిస్తున్నాయని ఇదే తరహాలో వీకే7లో ఉత్పత్తి జరిగే విధంగా సంబంధిత అధికారులు పనులను వేగవంతం చేయాలన్నారు. చైర్మన్ వెంట డైరెక్టర్లు ఎల్‌వీ. సూర్యనారాయణ, కొప్పుల వెంకటేశ్వర్లు, కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజరు షాలెంరాజు, జీఎంలు సూర్యనారాయణరావు, చింతల శ్రీనివాస్, సాయిబాబు, సైదులు, రాధాకృష్ణ, తిరుమలరావు, ఎస్‌వోటు జీఎం కోటిరెడ్డి, అధికారులు సూర్యనారాయణరాజు, శివకేశవులు, రామకృష్ణ, యోహాన్, రమేష్ తదితరులున్నారు.

మల్టీకాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టాలని వినతి


సీఎండీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

రుద్రంపూర్(సింగరేణి), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పరిధిలోని సింగరేణి సూపర్‌బజారు స్థలంలో మల్టీ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టాలని సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాంకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో సీఎండితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మిక ప్రాంతాల్లో నిర్మించనున్న కమ్యూనిటి హాలు నిర్మాణానికి స్థలాలు కేటాయించాలన్నారు. కొత్తగూడెం ఏరియాలోని వీకే ఓపెన్‌కాస్టును సింగరేణి యాజమాన్యమే బొగ్గు ఉత్పత్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్‌సంస్థలకు అప్పగిస్తే అడ్డుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు కార్మికసంఘం ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, ఏఐటీయూసీ నాయకులు కే. సారయ్య, మల్లిఖార్జున్‌రావు, రమణమూర్తి, శ్రీనివాస్ తదితరులున్నారు.

గోదావరి నది తీరంలో కోటి దీపోత్సవం


దీపోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని గోదావరి నదీ తీరంలో మంగళవారం రాత్రి కోటి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా కోరుకుండకు చెందిన శ్రీ కృష్ణ చైతన్య సంఘానికి చెందిన కల్యానం అప్పారావు నేతృత్వంలో భక్త బృందం గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను సమర్పించేందుకు భద్రాచలం చేరుకున్నారు. ఈ నేపథ్యంలో గోదావరి నది ఒడ్డున దీపోత్సవాన్ని నిర్వహించారు. సీతారామచంద్రమూర్తులను కోటి తలంబ్రాల దీపాల మధ్యన ఉంచి పూజలు చేశారు. విజయవాడ, నూజివీడు, విస్సనపేట, నెల్లూరుకు చెందిన భక్తులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కోరుకండ భక్త బృందం కోటి తలంబ్రాలను బుధవారం అందజేయనున్నారు.

నాలుగు కొలువుల విజేత


తల్లిదండ్రులతో గోపిశెట్టి సుస్మిత

తల్లాడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తల్లాడకు చెందిన గోపిశెట్టి వెంకటేశ్వర్లు, విజయమ్మ దంపతుల కుమార్తె సుస్మిత నాలుగునెలల్లో మూడు ఉద్యోగాలను సాధించింది. గ్రూప్-1 ఫలితాల్లో సుస్మిత 464.5మార్కులతో రాష్ట్రస్థాయిలో 311, జోనల్ స్థాయిలో 132వ ర్యాంకులు పొంది ఉన్నత ఉద్యోగానికి అర్హత సాధించింది. నాలుగునెలల క్రితం సుస్మిత గ్రూప్-4 ద్వారా హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికైంది. ఇటీవల విడుదలైన గ్రూప్-3 ఫలితాల్లో కూడా సుస్మిత ప్రతిభను చాటుకుంది. బీటెక్ పూర్తయిన తర్వాత సుస్మిత ప్రభుత్వ ఉన్నత ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో 2017నుంచి 2018వరకు ఢిల్లీలో వాజీరామ్ రవిలో సివిల్స్ కోచింగ్ తీసుకుంది. అనంతరం హైదరాబాద్‌లో ఉంటూ యూపీఎస్సీ ద్వారా సివిల్స్ రాసినప్పటికీ ఆశించిన ర్యాంకు రాకపోవడంతో నిరాశ చెందకుండా గ్రూప్-1 ద్వారానైనా ఉన్నత ఉద్యోగం సాధించాలనే తలంపుతో అనుకున్న లక్ష్యాన్ని సాధించింది. యూపీఎస్సీ ద్వారా భవిష్యత్‌లో సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో ఉన్నట్లు తనకు తల్లిదండ్రులు అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిదన్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారులు సుస్మితను ఘనంగా సన్మానించారు.

రాష్ట్రస్థాయిలో 317వ ర్యాంకు

సత్తుపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వెంట్ కావాలని ఆ తల్లి కోరికను గ్రూప్-1సాధించి నిజం చేశాడు కుమారుడు. మండల పరిధిలోని కాకర్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్న తాటి సుదర్శనమ్మ పెద్ద కుమారుడు ప్రమోద్‌సాయి. వీరిది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని తాటిసుబ్బన్నగూడెం. ప్రమోద్ సాయి పాఠశాల విద్యాభ్యాసం సత్తుపల్లిలోని వీవీ.విద్యాలయంలో, ఇంజనీరింగ్ విద్య హైదరాబాద్‌లోని విజ్ఞాన్‌జ్యోతిలో పూర్తి చేశారు. తండ్రి తాటి రామచంద్రరావు ప్రమోద్ బాల్యంలోనే మృతిచెందగా, అప్పటి నుంచి తల్లి సంరక్షణలో పెరిగాడు. కాగా ఇటీవల ప్రకటించిన గ్రూప్-1 ఫలితాలలో 464మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 317వ ర్యాంక్, ఎస్టీ (ఆదివాసీ కోయ) సామాజిక వర్గం జోన్-1లో 10వ ర్యాంకు పొందాడు.

ఎలాంటి కోచింగ్ తీసుకోలేదు..

గ్రూప్-1 పరీక్షలకు ఎటువంటి కోచింగ్ తీసుకోకుండానే తాను ఇంటివద్ద ప్రిపేర్ అయినట్లు ప్రమోద్‌సాయి తెలిపారు. ఢిల్లీలోని వాజీరం కోచింగ్ సెంటర్‌లో ఐఏఎస్ శిక్షణ తీసుకుంటున్న సమయంలో 2018లో జరిగిన ప్రమాదంలో తీవ్రం గాయపడి ఆరేళ్ల విలువైన కాలాన్ని కోల్పోయానని, అయినప్పటికీ ఆత్మవిశ్వాసంతో అమ్మప్రోత్సాహంతో ముందుకు సాగుతూ చదివి మెయిన్స్‌కు క్వాలీఫై అయ్యానని తెలిపారు.


తల్లి, సోదరుడితో ప్రమోద్

ఆధ్యాత్మిక ప్రాంతాల విస్మరణ

» జటాయువు త్యాగాన్ని ఉష్ణగుండాలను మరిచారు..
» దర్శనీయ స్థలాలపై తెలుగు ప్రభుత్వాల శీతకన్ను


గుండాల గోదావరి తీరంలో ఉష్ణగుండాల

భద్రాచలం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జటాయువు త్యాగానికి గుర్తింపేది ? ఉష్ణ గుండాల చరిత్రను గుర్తించేదెవరు..? దశాబ్ద కాలం క్రితం వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి పాలక ప్రభుత్వాలు ఆ ప్రాంతాలపై దృష్టి సారించేవి. అయితే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం అనంతరం నాటి నుంచి నేటి వరకు పాలక ప్రభుత్వాలు వాటి ఊసే మరిచారు. ఆధ్యాత్మికంగా, చారిత్రాత్మకంగా ఎంతో ప్రసిద్ధి పొందిన ఆ రెండు స్థలాలపై రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించటం లేదనే విమర్శలు ఉన్నాయి. ఆ రెండు ప్రాంతాలు ఇతిహాసపరంగా, పురాణపరంగా ఎంతో ప్రసిద్ధి చెందాయి. ఈ ప్రాంతపు రామభక్తులందరూ కూడా ఎంతో విశ్వసిస్తారు. రామ కథతో రెండింటికి సంబంధం ఉన్నట్లు చెబుతారు.

ప్రాశస్త్యం ఇదే...

జటాయువు త్యాగనిరతికి ప్రతీకగా నిలుస్తుండగా, రెండోది అమ్మ వారి స్నాన స్థలంగా ప్రఖ్యాతి గాంచింది. ఆనాడు జటాయువుపాకగా పిలవబడే నేటి ఎటపాక, మరొకటి ఉష్ణగుండాల. జటాయువుపాక రామకథతో సంబంధం ఉన్న ప్రాంతం. దశరథుడి మిత్రుడిగా జటాయువు రాముడుకు పరిచయం చేసుకుంటాడు. రామచంద్రా నీవు ఆశ్రమంలో లేని సమయంలో సీతకు నేను రక్షణగా ఉంటాను అన్నాడు. ఆ మాట సత్యం చేస్తూ రావణుడు సీతను అపహరించుకుని వెళ్లే సమయంలో శక్తి వంచన లేకుండా యుద్ధం చేశాడు. చివరకి కొన ఊపిరితో నిలిచి సీత జాడను రామునికి తెలియజేసి దశరథుడు పొందని ఘనమైన రాముని చేత అంత్య సంస్కారాలు పొందిన పుణ్యాత్ముడు. ఈ విధంగా ఎటపాక ప్రసిద్ధి చెందింది. నేటికి కూడా జటాయువు రెక్కలు పడిపోయిన స్థలం భక్తులకు దర్శనం ఇస్తుంది. అలాగే సీతారాములు వనవాసంలో సంచరించిన సమయంలో సీతమ్మ తల్లి స్నానమాడేందుకు శీతాకాలంలో వేడి నీరు లభించేలా లక్ష్మణుడు బాణాన్ని ఇసుక తిన్నెల్లో సంధించగా అక్కడ వేడి నీళ్లు వచ్చాయని ప్రతీతి. ఆ ప్రాంతంలోని గోదావరి ఇసుక తిన్నెల్లో బావి తీస్తే నేటికి వేడి నీరు వస్తుంది. పురాణపరంగా తీర్థం అని కొందరు పండితులు సైతం పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా ఏటా శ్రీరామనవమి ముక్కోటి సమయంలో ఉష్ణగుండాలలో ఆ ప్రాంతంలో స్థానికులు బావిలాగా తయారుచేసి భక్తులకు అందుబాటులోకి తెస్తారు. ఇంతటి జనాదరణ పొందిన ఉభయ స్థలాలపై రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు గత దశాబ్ద కాలం నుంచి శీతకన్ను వేయటం పట్ల రామభక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఊసే మరిచిన ప్రభుత్వాలు

రామాయణం ఇతివృత్తంతో ముడిపడి ఉన్న ఇంతటి ఆధ్యాత్మిక, చారిత్రాత్మక ప్రాంతాల అభివృద్ధి విషయంలో రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు గత దశాబ్ద కాలంగా ఊసే మరిచాయని రామభక్తులు ముక్తకంఠంతో పేర్కొంటున్నారు. దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం పుణ్యక్షేత్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ రెండు దర్శనీయ స్థలాల అభివృద్ధి మాట దేవుడెరుగు. కనీసం నిర్వహణ సైతం చేపట్టకపోవడం పట్ల రామభక్తులు ఆవేదన చెందుతున్నారు. ఏపీలో విలీనమైన అనంతరం ఎటపాక, ఉష్ణగుండాల దర్శనీయ స్థలాలను ఆ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఎటపాకలోని జటాయువు మండపం వద్ద గ్రామస్థులే తమవంతుగా అభివృద్ధి చేసి భక్తులకు అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. ఉష్ణగుండాల పరిస్థితి కూడా అలానే ఉంది. ఆ రెండు దర్శనీయ స్థలాలు ఏపీ పరిధిలోకి వెళ్లటంతో తెలంగాణ ప్రభుత్వం, అధికారులు కూడా ఏమి చేయడం లేదు. గతంలో జటాయువు మండపం వద్ద కల్యాణం, ఇతర పూజలను భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించేవారు. కానీ ప్రస్తుతం ఎటువంటి అభివృద్ధి లేదా కార్యక్రమాలు లేకపోవటంతో రామభక్తులు నిరాశ చెందుతున్నారు.

సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా కిరణ్‌రాజ్‌కుమార్

రుద్రంపూర్ (సింగరేణి), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ కిరణ్‌రాజ్‌కుమార్‌ను నియమిస్తూ సింగరేణియాజమాన్యం మంగళవారం ఉత్తర్వులను జారీ చేసింది. సీఎంవోగా విధులు నిర్వహించిన సుజాత మార్చి 31వ తేదీన పదవీ విరమణ చేయడంతో కిరణ్‌రాజ్‌కుమార్‌ను నియమించారు. కిరణ్‌రాజ్‌కుమార్ నియామకం పట్ల సింగరేణి ఉద్యోగులు, కార్మికసంఘాల నాయకులు హర్షం ప్రకటించారు. సింగరేణి సంస్థలో రాజ్‌కుమార్‌కు అత్యున్నత పదవిని కల్పించిన సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్‌ను సింగరేణి మాదిగ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొంకూరి మోహన్, చొప్పగండి దుర్గా ప్రసాద్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

బోనకల్, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): బోనకల్ రైల్వే స్టేషన్ వద్ద మంగళవారం రైలు ఢీ కొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. బోనకల్ రైల్వే స్టేషన్‌లోని రెండో ప్లాట్‌ఫామ్ చివరన గుర్తుతెలియని 35సంవత్సరాల వ్యక్తి ట్రాక్ దాటే క్రమంలో సింహపురి ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టింది. దీంతో మృతి చెందాడు. మృతుడు చామనఛాయ కలిగి, ఛాతిపై పుట్టుమచ్చ ఉంది. ముదురు ఆకుపచ్చ టీషర్టు, బ్లూ రంగు లోయర్ ధరించాడు. ఈ సంఘటనా స్థలానికి ఖమ్మం జీఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ కర్రి శ్రీనివాసరావు చేరుకున్నారు. అన్నం ఫౌండేషన్ నిర్వాహకుడు అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేశారు.

పాముకాటుతో బాలుడి మృతి



ములకలపల్లి,ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జగన్నాధపురం గ్రామంలో పాముకాటుతో బాలుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. జగన్నాధపురం గ్రామానికి చెందిన సురేష్, హేమలతకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన పురుగు మందుల వ్యాపారం చేస్తున్నాడు. పాపతోపాటు బి.సాయిసుకుమార్(11) ఉన్నారు. పాల్వంచలోని ఓప్రైవేటు పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్నాడు. సోమవారం పాఠశాలకు సెలవు కావటంతో ఇంటి వద్ద ఆడుకుంటున్నాడు. ఈక్రమంలో సోమవారం రాత్రి బంతితో ఆడుకుంటున్నాడు. ఇంట్లో ఉన్న రంధ్రంలో బాలు పడగా తీసే క్రమంలో పాము కాటేసింది. దీంతో తల్లిదండ్రులు హుటాహుటిన ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.

విద్యార్థి సంఘ నాయకుల అరెస్ట్ అక్రమం

చుంచుపల్లి, ఏప్రిల్01(ఆంధ్రజ్యోతి): శాంతియుత పోరాటం చేస్తున్న విద్యార్థి ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్రప్రధాన కార్యదర్శి ఏ.సాంబ, జిల్లాప్రధాన కార్యదర్శి ప్రణయ్‌కుమార్ మంగళవారం ఖండించారు. విద్యార్థి నాయకులను ముందస్తు పేరుతో అక్రమంగా నిర్బంధించడం సరికాదన్నారు. కారణాలు చెప్పకుండా విద్యార్థి సంఘాల కార్యక్రమాలు లేనప్పటికీ ముందస్తు అరెస్టు పేరుతో భద్రాద్రి జిల్లాలో 25మంది నాయకులను తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు. నాయకుల ఇళ్లల్లో, కార్యాలయాల దగ్గరికి వెళ్లి అక్రమ అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్స్‌లో నిర్బంధించడం హేయమైన చర్యలని అన్నారు. ఇలాంటి చర్యలను విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు అన్నివర్గాల ప్రజలు ఖండించాలన్నారు.

భూ కబ్జా కేసులో నలుగురి రిమాండ్

ఖమ్మంరూరల్, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): భూ కబ్జాకేసులో నలుగురిని రిమాండ్ చేసిన సంఘటన ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని ఏదులాపురంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ క్రాస్‌రోడ్డుకు చెందిన మెట్టు అరుణకు ఏదులాపురం రెవెన్యూ పరిధిలోని బైపాస్ రోడ్డు పక్కన ప్లాటు ఉంది. ఆ ప్లాటును ఏదులాపురం గ్రామానికి చెందిన ఏపూరి శ్రీహరి, శివ అలియాస్ ప్రతాప్, వడ్లకుంట భూజంగరావు, ఇనుపనూరి చంద్రశేఖర్‌లు కబ్జాకు యత్నించారు. అంతేకాకుండా దాడికి పాల్పడ్డారు. దీంతో వారిపై బాధితులు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ నిర్వహించారు. విచారణ అనంతరం నిందితులను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

90 కేజీల బెల్లం, పటిక పట్టివేత

జూలూరుపాడు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జూలూరుపాడు, పాపకొల్లు గ్రామాలలోని కిరాణ దుకాణాల్లో కొత్తగూడెం ఎక్సైజ్ శాఖ సిబ్బంది మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఎస్సై భాషా తెలిపిన వివరాల ప్రకారం.. పాపకొల్లులోని చందా వర్షిత్ అనే వ్యాపారి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 90 కేజీల బెల్లం, 8కేజీల పటికను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వ్యాపారిపై కేసు నమోదు చేశామన్నారు. బెల్లం, పటిక విలువ రూ.6780 ఉంటుందని తెలిపారు. వ్యాపారులు ప్రజలకు కేజీ బెల్లం ముద్దలను విక్రయించవద్దని, పావు కేజీ బెల్లం ముక్కలను మాత్రమే విక్రయించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ తనిఖీలలో హెడ్‌కానిస్టేబుళ్లు ప్రకాశ్,ముత్తయ్య, సిబ్బంది సత్యనారాయణ,కిరణ్,మౌనిక పాల్గొన్నారు.



కుర్నవల్లి గ్రామసమీపంలోని పెద్దచెరువులో చేపల వేట

జలపుష్పాల కోసం జనజాతర

కుర్నవల్లిలో చేపల వేటకు దిగిన పలు గ్రామాల ప్రజలు

కరకగూడెం, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సమత్ భట్టుపల్లి పంచాయతీ కుర్నవల్లి గ్రామసమీపంలోని పెద్దచెరువులో బుధవారం చేపలను పట్టేందుకు ప్రజలు బారులు తీరారు. చెరువులో జలపుష్పాల జాతర తలపించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కరకగూడెం మండలం పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం కావడంతో ఇక్కడ రైతులు ఎక్కువగా ధాన్యం పంటలను సాగు చేస్తారు. గతంలో ఇక్కడ సాగునీరు లేక పోవడంతో అప్పటి రైతులు సాగునీరు కోసం పదుల సంఖ్యలో చెరువులను ఏర్పాటు చేసుకున్నారు. ఈ చెరువు నీటితో పంటలను సాగునీరు అందించుకునేవారు. ఎండకాలం వస్తుండటంతో చెరువులో నీరు ఇంకిపోయే సమయంలో చెరువు ఉన్న గ్రామాల ప్రజలు చేపలను పట్టే ముందు మండలంలోని పలు గ్రామాల ప్రజలకు తెలపడం ఇక్కడ ఆనవాయితీ.. బుధవారం చేపల చెరువులో చేపలను పడుతుండటంతో కరకగూడెం, వెంకటాపురం, సమత్‌భట్టుపల్లి, భట్టుపల్లి, రేగళ్ళ, కన్నాయిగూడెం, చిరుమళ్ళ, వంటంవారిగుంపు, తాటిగూడెం, పద్మాపురం, రఘునాధపాలెం ప్రజలు ఆటోలు, ద్విచక్ర వాహనంలో, కాలినడకన ఊతలు, ఒలలతో చెరువు వద్దకు చేరుకున్నారు. ఎర్రటి ఎండలో తళుక్కున మెరుస్తున్న నీటిలో మునకలు వేస్తున్న చేపలను ఎక్కడక పోతావంటూ ఒడిసి పట్టేందుకు మత్స్య ప్రియులు పోటీ పడ్డారు. దీంతో చేపల చెరువులో జనజాతర తలపించింది.



కానిస్టేబుల్ ఆత్మహత్య



ఖమ్మంక్రైం,ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం రాత్రి ఖమ్మం నగర పరిధిలో జరిగింది. నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ బండి కృష్ణ (42)దంసలాపురం సమీపంలో గుర్తుతెలియని రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వేసిబ్బంది గమనించి జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనాస్థలం వద్దకు చేరుకొని వివరాలు సేకరించారు. అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కృష్ణ నాలుగు రోజులగా సెలవులో ఉన్నట్లు సమాచారం ఆత్మహత్య ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఇసుక టిప్పర్ల పట్టివేత

తల్లాడ, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా నందిగామ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను తల్లాడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున తల్లాడ ఎస్ఐ బి.కొండల్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను గుర్తించి పట్టుకున్నారు. టిప్పర్లను తల్లాడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

హెల్త్ సూపర్‌వైజర్ దారుణ హత్య

» మహబూబాబాద్ జిల్లాలో ఘటన, మృతుడిది చర్ల



మహబూబాబాద్‌రూరల్, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ మండలం అయోధ్య గ్రామపరిధిలోని భజనతండ శివార్లలో దంతాలపల్లి జ్యోతిరావుపూలే పాఠశాల హెల్త్‌సూపర్‌వైజర్ తాటి పార్థసారథి(42) దారుణహత్యకు గురయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్లకు చెందిన పార్థసారథి కుటుంబం కొంతకాలంగా భద్రాచలంలోని జగదీష్‌నగర్ కాలనీలో నివాసముంటోంది. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే ఏడాది నుంచి మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి జ్యోతిరావుపూలే పాఠశాలలో హెల్త్‌సూపర్ వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన.. ఉగాది పండుగకు గాను భద్రాచలం వెళ్లి.. సోమవారం సాయంత్రం తన ద్విచక్రవాహనంపై దంతాలపల్లికి బయలుదేరారు. ఈ క్రమంలో అయోధ్య పరిధిలోని భజనతండ శివారులోని మిర్చి తోట వద్ద రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆయన వాహనాన్ని అడ్డగించి గొడ్డలితో తలపై నరికి చంపారు. అయితే తెల్లవారుజామున ఆ దారి గుండా వెళ్లేవారు ఇచ్చిన సమాచారంతో విషయం వెలుగులోకి రాగా.. మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య హుటాహుటిన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని మహబూబాబాద్ ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి రాత్రికి పోస్టుమార్టం నిర్వహించారు.

పలు కోణాల్లో పోలీసుల దర్యాప్తు

సోదరుడి హత్య విషయం తెలుసుకున్న పార్థసారథి సోదరి హేమ ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఏడాది క్రితం భద్రాచలంలోని ఒకసారి కొందరు హత్య చేసేందుకు వెంటపడ్డారని.. ఈ ఘటనపై అప్పట్లో అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె వెల్లడించారు. కొంతకాలంగా తన అన్న, వదిన మధ్య కుటుంబ కలహాలు జరుగుతున్నాయని, ఈ హత్యలో తన వదిన ప్రమేయం ఉంటుందని అనుమానాలు వ్యక్తం చేశారు. కాగా భద్రాచలానికి చెందిన ఓ వ్యక్తి దుండగులకు సుపారీ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

బొమ్మాబొరుసుపై పోలీసుల దాడులు

» రూ.60వేలు,కారు, 9మోటారు సైకిళ్లు సీజ్

టేకులపల్లి, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సమ్మక్క గద్దెల సమీపంలో గల రహదారిలో బొమ్మాబొరుసు ఆడుతున్న వారిపై మంగళవారం టేకులపల్లి పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో బొమ్మాబొరుసు(చిత్తు బొత్తు) ఆడుతున్న 14మందిని అదుపులోకి తీసుకొన్నారు. వారి నుంచి రూ.60వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కారు, 9మోటారుసైకిళ్లను సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు టేకులపల్లి ఎస్సై పోగుల సురేష్ తెలిపారు. పేకాట, జూదం, బొమ్మాబొరుసు ఆటలాడితే కఠిన చర్యలు తీసుకొంటామని ఎస్సై హెచ్చరించారు.

చోరీ నిందితుడి అరెస్టు


ద్విచక్రవాహనాలు, నిందితుడు

ఖమ్మంక్రైం,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి):జల్సాలకు అలవాటుపడి దొంగతనాలు చేస్తున్న భద్రాచలం ప్రాంతానికి చెందిన నిందితుడు కోడి శేఖర్ అలియాస్ జంపన్నను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఖానాపురం హవేలి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పంచాక్షరీ కాలనీ, వెలుగుమట్ల ప్రాంతంలో నిందితుడు ఉన్నాడనే సమాచారంతో అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. ఖమ్మం వన్‌టౌన్, టూటౌన్, ఖానాపురంహవేలి పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో నిందితుడితో కలిసి తొమ్మిది దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించాడని, 10గ్రాముల బంగారం, 4ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు.



ఏదులాపురం మునిసిపాలిటీకి రూ.90.50 లక్షలు నిధులు

ఖమ్మంరూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ అభివృద్ధికి రూ.90.50 లక్షలు మంజూరయ్యాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ నిధులు మంజూరైనట్లు మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి మంగళవారం తెలిపారు. వేసవిలో తాగునీరు సమస్య తలెత్తకుండా వాటి పరిష్కారానికి రూ.50లక్షలు, డివిజన్ల సుందరీకరణలో భాగంగా డివైడర్ల మధ్య మొక్కల ఏర్పాటుకు రూ.15.50లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. శానిటేషన్, ఎల్ఈడీ వీధిలైట్లు ఏర్పాటుకు రూ.25లక్షలు కేటాయించినట్లు తెలిపారు.

రేపు గ్రామీణ వైద్యుల మహాసభ

కామేపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): గ్రామీణ వైద్యుల సహాయక సంఘ ఆధ్వర్యంలో 24వ మహాసభను విజయవంతం చేయాలని గ్రామీణ వైద్యుల సహాయ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు దారా సుందర్‌రావు ఓ ప్రకటనలో కోరారు. గురువారం ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఈ సమావేశం జరుగుతుందన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు. గ్రామీణ వైద్యులు అందరు హాజరై మహాసభను విజయవంతం చేయాలన్నారు.

కమ్యూనిస్టులు చట్ట సభల్లో ఉండాలి

సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి సురేష్



జెండా ఎగురవేస్తున్న సురేష్

ఖమ్మంరూరల్, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టులు చట్టసభల్లో ఉండాలని రాజకీయ విశ్లేషకులు, ప్రజలు ముక్తకంఠంతో కోరుకుంటున్నారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా అన్నారు. ఏదులాపురం మునినిసిపాలిటీ పరిధిలోని మద్దులపల్లి గ్రామంలో గ్రామ శాఖ సభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న కార్పోరేట్ విధానాలపై నిస్వార్థంగా ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే అన్నారు. కమ్యూనిస్టులకు ఎంపీ, ఎమ్మెల్యే ప్రజాప్రతినిధి, అధికారం అనే పదవులు అవసరం లేదని, ఎర్రజెండా చేతబట్టి ప్రజల సమస్యలపై చేసే పోరాటమే అతిపెద్ద పదవి అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రెంటాల శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్న వెంకటరెడ్డి, మండల కార్యదర్శి పుచ్చకాయల సుదాకర్, తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధాలతో కాంగ్రెస్ పరిపాలన

సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీల అమలు నినాదంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడో గ్యారెంటీగా సమాధిని అమలు చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరణ చేస్తామని ప్రకటించి ఇప్పుడు నిర్బంధాలు అక్రమ కేసుల్ని బనాయిస్తోందని విమర్శించారు. హెచ్‌సీయూ భూముల ప్రభుత్వ స్వాధీనాన్ని వెంటనే నిలుపుదల చేయాలని కోరారు.

మాల మహానాడు జిల్లా యువజన అధ్యక్షుడిగా కమలాకర్



ఖమ్మంచర్చ్‌కాంపౌండ్, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): మాల మహానాడు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా పోతురాజు కమలాకర్ నియమితులయ్యారు. మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి మడుసు ప్రతాప్‌జాకబ్ చేతులమీదుగా మంగళవారం నియామకపత్రం అందుకున్నారు మాల మహానాడు సంఘంలో కీలకంగా పనిచేస్తున్న సందర్భంగా కమలాకర్‌ను యువజన విభాగం అధ్యక్షుడిగా నియమించినట్లు జాకబ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి పేరం మల్లయ్య, ఖమ్మం పట్టణ అధ్యక్షుడు తలారి రాధాకృష్ణ, మాల మహానాడు జిల్లా నాయకులు కొరివి దయానంద్, నవీన్‌బాబు, దోతుల వెంకన్న, కాశీమల్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల ఇళ్లపన్నులు రద్దు చేయాలి

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని నాయుడుపేట, పెద్దతండా, రాజీవ్ గృహకల్ప, వికలాంగుల కాలనీ, తదితర ప్రాంతాల్లో వరద ముంపు బాధితుల ఇంటి పన్నులు రద్దుచేయాలని సీపీఎం నాయకుడు నందిగామ కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి సమ్మలతో కూడిన వినతి పత్రాన్ని మంగళవారం సీపీఎం బృందం అందజేశారు. తీగల వంతెన ప్రాంతంలో ఇళ్లు కోల్పోతున్న వారికి వెంటనే ఇళ్ల స్థలాలు అందించి ఆదుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

అదనపు కలెక్టర్ శ్రీజ

మధిర రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అర్హులైన యువత రాజీవ్ యువవికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ సూచించారు. మంగళవారం మధిర మండలం దెందుకూరు గ్రామం లో రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీవ్ యుక వికా సం దరఖాస్తు గడువును ప్రభుత్వం ఈనెల 14వరకు పెంచిందని, అర్హులైన నిరుద్యోగ యు వత పూర్తిస్థాయిలో దరఖాస్తు చేసుకొని ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందాలన్నారు. నిరుద్యోగ యువతపై పెద్ద మొత్తంలో ప్రభు త్వం నిధులు ఖర్చుచేస్తూ రాజీవ్ యువ వికా సం పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. తెల్లరేషన్‌కార్డులో దరఖాస్తుదారుడి పేరు లేని పక్షంలో గ్రామీణ ప్రాంతా ల్లో వార్షిక ఆదాయం పరిమితి రూ.1.50లక్షలలోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.రెండులక్షలలోపు ఆదాయ సర్టిఫికెట్ సమర్పించాలని సూచించా రు. లబ్ధిదారులను ఎంపిక చేసిన తర్వాత వారికి మంజూరు పత్రాలు జారీ చేయడంతోపాటు వ్యాపార నిర్వహణలో పాటించాల్సిన సూత్రాలపై శిక్షణ కూడా అందిస్తామని, ఆసక్తిగల యువకులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీజ సూచించారు.

సత్తుపల్లిలో ఆస్తిపన్ను వసూళ్లు రూ.4.26కోట్లు

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకంలో భాగంగా స్పెషల్ డ్రైవ్ ద్వారా ఆస్తిపన్ను రూ.4.26కోట్లు వసూలు చేసినట్లు సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్ కే.నర్సింహ తెలిపారు. గతేడాది (85.16 శాతం) కంటే 86.76శాతాన్ని అధిగమించి రికార్డు నెలకొల్పినట్లు మంగళవారం తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం రూ.4.91కోట్లు కాగా రూ.65లక్షలు వెనకబడ్డామని, అయినా గతేడాది కంటే అదనంగా వసూళ్లలో ముందంజలో నిలిచామన్నారు. 9ప్రత్యేక బృందాలు పన్నుల సేకరణలో పాల్గొన్నాయన్నారు.

పేదల ఆహార భద్రతకు కాంగ్రెస్ కృషి

- మేయర్ పునుకొల్లు నీరజ
- పలు డివిజన్లలో సన్నబియ్యం పంపిణీ చేసిన కార్పొరేటర్లు



సన్నబియ్యం పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ మేయర్ నీరజ

ఖమ్మంసంక్షేమవిభాగం,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): పేదల ఆహార భద్రతకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మేయర్ పునుకొల్లు నీరజ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఖమ్మంలోని 26వ డివిజన్‌లో సుగ్గలవారి తోటలో రేషన్‌దుకాణంలో సన్నబియ్యం పంపిణీని మేయర్ ప్రారంభించారు. పేదలకు సన్నబియ్యం ఇవ్వటం సంక్షేమంలో విప్లవాత్మక మార్పుగా అభివర్ణించారు. ప్రజాపంపిణీ అధికారులు చందన్‌కుమార్, విజయ్‌బాబు పాల్గొన్నారు.

సీఎం,మంత్రుల ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం

కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అధికారంలోకి వచ్చినా బడుగు, బలహీనవర్గాలు, ముస్లీం, మైనార్టీలు, ఎస్సీ, గిరిజన, బీసీ ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతోందని 28వ డివిజన్ కార్పొరేటర్ గజ్జల లక్ష్మీ పేర్కొన్నారు. మంగళవారం ప్రకాశ్‌నగర్ రేషన్ దుకాణంలో కార్పొరేటర్ సన్నబియ్యం పంపిణీ చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ నాయకులు గజ్జల వెంకన్న, అంకాల వీరభద్రం, సుంకర సతీష్‌వర్మ, జెట్టి లింగరాజు, కొండ్రు చైతన్యకుమార్, అఫ్జల్, ఆముదాల లక్ష్మణ్; ఉప్పిరెడ్డి, గంటల సంతోష్‌కుమార్, బాశెట్టి నాగేశ్వరరావు, గాడుదల వెంకటేష్, గంగరబోయిన రవి, బోడ్డు శ్రీను,బోడ్డు వెంకన్న, వీర్ల రమణ పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీ మంచి నిర్ణయం
తుంబూరు దయాకర్‌రెడ్డి

నేలకొండపల్లి: సన్న బియ్యం పంపిణీ చేయాలన్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయం చారిత్రాత్మకమని కాంగ్రెస్ నాయకుడు తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మంగాపురంతండాలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని దయాకర్ రెడ్డి ప్రారంభించారు. సొసైటీ అధ్యక్షుడు ధరావత్ బాలాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దయాకర్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు సన్నబియ్యం పంపిణీతో రాష్ట్రంలో నూతన అధ్యాయం ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో నెల్లూరి భద్రయ్య, సీతారాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు. కొత్తకొత్తూరులో కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ ప్రారంభించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీ ప్రారంభమైంది. కార్యక్రమంలో తహసీల్దార్ జాదవ్ మాణిక్యం,ఎంపీడీఓ మర్రి యర్రయ్య, ఎమ్మారైలు రవి, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు మేలు

తిరుమలాయపాలెం: కాంగ్రెస్ హయాంలో అన్నివర్గాల వారికి మేలు జరుగుతుందని జిల్లా కాంగ్రెస్ నాయకుడు రామసహాయం నరేష్‌రెడ్డి, ఆత్మ కమిటీచైర్మన్ చావా శివరామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని హైదరసాయిపేట, జల్లేపల్లి తదితర గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీని వారు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో డీటీ కనకం నరసింహరావు, ఆర్ఐ వీరయ్య, మాజీ ఎంపీపీ బోడ మంగిలాల్, ఏఎంసీడైరెక్టర్ జడల నగేష్, సిరిగడ్డె ఉపేందర్, పోట్ల కిరణ్, అంబేద్కర్, సైఫుద్దీన్, చీమ్లానాయక్, కోటి పాల్గొన్నారు.

అర్హులందరికీ సన్న బియ్యం: దయాకర్ రెడ్డి

ఖమ్మంరూరల్: అర్హులందరికీ సన్న బియ్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ నాయకుడు దయాకర్ రెడ్డి అన్నారు. ఏదులాపురం మునిసిపాలిటి పరిధిలోని పెద్దతండాలో మంగళవారం సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాంప్రసాద్, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, మద్దులపల్లి మార్కెట్ కమిటి చైర్మన్ హరినాధబాబు, ఆర్ఐ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



బియ్యం పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వైష్ణవి



బియ్యం పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ గజ్జల లక్ష్మీ



పెద్దతండాలో బియ్యం అందజేస్తున్న దయాకర్‌రెడ్డి



మంగాపురంతండాలో మాట్లాడుతున్న దయాకర్‌రెడ్డి

ఆ తాగునీటిపై మక్కువ

- రోజుకు సుమారు 2వేల కుటుంబాలు వినియోగం
- దాహార్తి తీరుస్తున్న రస్తోగినగర్‌లో సాగర్ కాలువ పక్కన నీటిపంపు

ఖమ్మంఖానాపురంహవేలి,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్ రస్తోగినగర్‌లో సాగర్ కాలువ పక్కన ఉన మంచినీటి పంపు 27 ఏళ్లుగా ప్రజల దాహార్తి తీర్చుతోంది. 1998లో అప్పటి ఎంపీ నాదెండ్ల భాస్కరరావు నిధులతో చేతి పంపును ఏర్పాటు చేశారు. దీంతో నాటినుంచి ప్రజలు అధిక సంఖ్యలో తాగునీటిని తీసుకెళుతున్నారు. దీంతో పెద్దసంఖ్యలో జనాలు రావటంతో నీళ్లు పట్టుకునేందుకు గంటల తరబడి వేచిఉండాల్సి పరిస్థితి ఉండేది. 2003లో ఖమ్మం కలెక్టర్‌గా ఉన్న అరవిందకుమార్ ఖమ్మం నుంచి ఇల్లెందు వెళుతూ ప్రజలు పంపు వద్ద అధిక సంఖ్యలో ఉండటం గమనించారు. పంపు వద్దకు వచ్చి విషయం తెలుకున్నారు. వెంటనే అధికారులకు చేతిపంపును తీసివేసి మోటర్ బిగించాలని ఆదేశించారు. కొన్నిగంటల్లోనే అధికారులు చేతిపంపు స్థానంలో మోటారు బిగించారు. ప్రత్యేకంగా ఒక వ్యక్తిని కేటాయించారు. ఆ తరువాత మోటార్ బాధ్యతను మునిసిపల్ అధికారులకు అప్పగించారు. నాటినుంచి నేటి వరకు మునిసిపల్ కార్యాలయం పరిధిలోనే ఈ మోటార్ పంపు, ఆపరేటర్ జీతాలను అందిస్తున్నారు. మోటర్ రిపేరు ఐతే గంటల వ్యవధిలోనే అందుబాటులోకి తీసుకొస్తారు.

రోజుకు 2వేల మంది..

ఖమ్మం నగరంలో వీధికొక మినరల్ ప్లాంట్, ధనికుల ఇళ్లలో ప్యూరీఫైడ్‌లు అధికంగా ఉన్న ఈరోజుల్లో పట్టణాలలో చేతి పంపులు కానరాకుండా పోయాయి. కానీ ఎన్ని మినరల్ వాటర్ ప్లాంటులు ఉన్నా నగరంలోని రస్తోగినగర్ సాగర్ కాలువ పక్కన గల మంచినీటి పంపునకు ప్రజల రద్దీ మాత్రం తగ్గటంలేదు. రోజుకు సుమారు 2వేల మందికి పైగా ఈ మంచినీటిని తీసుకెళ్లటం విశేషం. నగరంలోని వారితోపాటు చుట్ట పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు ఈ మంచినీటిని కార్లలో, ద్విచక్ర వాహనాలలో తీసుకెళ్తారు. ఈపంపు 24గంటలు అందుబాటులో ఉంటుంది. మోటార్ పక్కనే ఆన్ ఆఫ్ స్విచ్చులను ఏర్పాటు చేశారు. నీటిని తెచ్చుకోలేని వారు ఈ మంచినీటికి ఒక్కో క్యానును ఐదు రూపాయలకు కొంటున్నారు. సైకిల్‌పై కొందరు ఈ మంచినీళ్లను ఇంటింటికి తిరిగి విక్రయిస్తున్నారు. రోజుకు 100 నుంచి 150 క్యాన్లను విక్రయిస్తున్నారు.



నీటిని పట్టుకుంటున్న ప్రజలు



కారులో మంచినీరు తీసుకెళుతున్న దృశ్యం

బాధ్యతలు స్వీకరించిన బార్ అసోసియేషన్ కార్యవర్గం



ఖమ్మంలీగల్,ఏప్రిల్ 01(ఆంధ్రజ్యోతి): బార్ అసోషియేషన్ నూతన కార్యవర్గం మంగళవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. అధ్యక్ష, కార్యదర్శులు తొండపు వెంకటేశ్వరరావు, గద్దల దిలీప్‌కుమార్ మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమం, సమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తామని, బార్ మరియు బెంచ్‌లతో మంచి సంబంధాలను కొనసాగిస్తామని అన్నారు. ఉపాధ్యక్షురాలు మోతుక్కూరి విజయశాంత, జాయింట్‌సెక్రటరీ ఎం.నవీన్‌కుమార్, గ్రంథాలయ కార్యదర్శిగా ఎస్.రాంబాబు, క్రీడల కార్యదర్శిగా కె.వి.వి.లక్ష్మీ, కోశాధికారిగా పి.నరసింహారావు, మహిళా ప్రతినిధిగా పి.ఇందిర బాధ్యతలు స్వీకరించారు. సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

పూర్వ విధులకు కేఎంసీ ఉద్యోగులు

- పన్నుల వసూళ్ల నేపథ్యంలో రెండు నెలలు క్షేత్రస్థాయిలోనే విధులు
- వసూళ్లలో కీలకంగా వ్యవహరించిన ఉద్యోగులు
- క్షేత్రస్థాయిలో కష్టపడిన ఉద్యోగులతో నేడు కమిషనర్ సమావేశం

ఖమ్మంసంక్షేమవిభాగం,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): పరిపాలన అవసరాల నిమిత్తం రెండు నెలల పాటు ఖమ్మం నగరంలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించిన ఉద్యోగులు నేటినుంచి పూర్వ విధుల్లో చేరనున్నారు. పన్నుల వసూలును దిగ్విజయంగా పూర్తి చేశారు. ఖమ్మం నగర పాలక సంస్థ పరిదిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే, ప్రజాపాలన గ్రామ సభలు, ఆదాయ వసూళ్లు, ఎల్ఆర్ఎస్ సర్వే, ఇతర అవసరాల కోసం కేఎంసీలోనే బాధ్యతలు చేపట్టాల్సిన ఉద్యోగులు 64మంది వరకు ఉద్యోగులు క్షేత్రస్థాయి బాట పట్టారు. ఖమ్మం నగరంలోని 20 రెవెన్యూ డివిజన్లను జల్లెడ పట్టారు. 12 ఆదాయ వసూళ్ల కౌంటర్లు, ఇంటింటి ట్యాక్స్ కలెక్షన్ చేపట్టారు. ఆదాయ వసూళ్లు, ఇతర సర్వేల కోసం ఆర్ఐలు ఐదుగురు, బిల్ కలెక్టర్లు 25 మంది, వార్డు ఆఫీసర్లు 18 మంది, వర్క్ ఇన్స్‌పెక్టర్లు 9మంది, కంప్యూటర్ అపరేటర్లు 4గురు, వారికి అసిస్టెంట్లుగా 11మంది నాల్గవ తరగతి ఉద్యోగులు బాధ్యతలు నిర్వహించారు. ఆదాయ వసూళ్ల రూ.32 కోట్లు కాగా రూ.34.70 కోట్లు సాధించారు. ఆదాయ వసూళ్లలో లక్ష్యానికి మించి వసూళ్లు చేసి రాష్ట్రస్థాయిలోని సీడీఎంఏ అధికారులతో శభాష్ అనిపించుకున్నారు. దీంతో బుధవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆదాయ వసూళ్లు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్)కు కష్టపడిన ఉద్యోగులు, సిబ్బందికి కమిషనర్ అభిషేక్ అగస్త్య సమావేశం నిర్వహించనున్నారు. వారిని అభినందించనున్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

శోభాయమానంగా అభయ వేంకటేశ్వరస్వామి కల్యాణం

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): నగరంలోని యూపీహెచ్ కాలనీ అభయ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం మూడో రోజు స్వామివారి కల్యాణం మహోత్సవం శోభాయమానంగా జరిగింది. ఆలయ ప్రధాన పూజారి నరగిరినాథుని రామాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు వేడుక నిర్వహించారు. ఉదయం స్వామి వారికి విశేష అలంకరణ, ఎదుర్కోలు సంవాదం నిర్వహించారు. రాత్రి స్వామి వారి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. 300ల మంది కళాకారులతో, భక్తజన బృందాల కోలాటాలు, అన్నమయ్య సంకీర్తనలు, మంగళవాయిద్యాల నడుమ శోభాయమానంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు, బొల్లి. కొమరయ్య, కార్యదర్శి పురం. తిరుపయ్య, కోశాధికారి బానోత్ మల్సూర్ నాయక్, డివిజన్ కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి, ఆలయ కమిటి సభ్యులు అల్లిక అంజయ్య. కొండల్‌రావు, వెంకన్న, లక్ష్మీ పాల్గొన్నారు.





సన్నబియ్యంతో పాటుగా.. సరుకులు ఇవ్వాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరోమణి



మాట్లాడుతున్న శిరోమణి

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): సన్న బియ్యంతో పాటు 12 రకాల నిత్యవసరాల వస్తువులను రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీపై పంపిణీ చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ శిరోమణి డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన పీవోడబ్ల్యూ జిల్లా కమిటీ సమావేశంలో శిరోమణి మాట్లాడారు. రాష్ట్రంలో దేశంలో మహిళలపై రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. ఇటీవల కాలంలో మహిళలపై సామూహిక అత్యాచారాల సంఘటనలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఊరుకొండపేటలో ఒక ఆలయం సమీపంలోనే మహిళపై ఏడుగురు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని ఆటువంటివారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలను మహిళా లోకం ముక్తకంఠంతో తీవ్రంగా ఖండించాలని కోరారు. రాష్ట్రంలో మహిళల వీరశక్తికి ఎంతో కీర్తి ఉందన్నారు. నైజాందొరలకు, భూస్వాములకు, పెత్తందారులకు ఎదురొడ్డి నిలిచిన మహిళలు చరిత్రలో ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. అటువంటి తెలంగాణ గడ్డపై రోజు రోజుకు మహిళలు, బాలికలు, విద్యార్థులపై అఘాయిత్యాలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా చట్టాలను కఠినంగా అమలు చేయాల్సిన ప్రభుత్వం వాటిని వదిలి, 2025 మే నెలలో హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలకు సిద్ధం అని ప్రకటనలు చేస్తుందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే మిస్ వరల్డ్ పోటీలను పీవోడబ్ల్యూ బహిష్కరిస్తుందని ప్రకటించారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు గోకినేపల్లి లలిత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యదర్శి ఆవుల మంగతాయి, నాయకులు తుడుము ఝాన్సీ, ప్రతాపనేని శోభ, పరిమళ, బండెల లలిత, గోకినేపల్లి సరోజిని, ఇమ్మిడి చైతన్య పాల్గొన్నారు.

సత్తుపల్లిలో ఆస్తిపన్ను వసూళ్లు రూ.4.26కోట్లు

» మునిసిపల్ కమిషనర్ నర్సింహ


మాట్లాడుతున్న కమిషనర్ నర్సింహ

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టి వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకంలో భాగంగా స్పెషల్ డ్రైవ్ ద్వారా ఆస్తిపన్ను రూ.4.26కోట్లు వసూలు చేసినట్లు సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్ కే.నర్సింహ తెలిపారు. ఈ సందర్భంగా గతేడాది (85.16 శాతం) కంటే 86.76శాతాన్ని అధిగమించి రికార్డు నెలకొల్పినట్లు మంగళవారం తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యం రూ.4.91కోట్లు కాగా రూ.65లక్షలు వెనకబడ్డామని, అయినా గతేడాది కంటే అదనంగా వసూళ్లలో ముందంజలో నిలిచామన్నారు. 9ప్రత్యేక బృందాలు పన్నుల సేకరణలో పాల్గొన్నాయని, సహకరించిన పట్టణ ప్రజలకు, వసూళ్లకు వెళ్లిన సిబ్బందికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్ ఉన్నారు.

ప్రమాదకరంగా వంతెన

» భయం భయంగా ప్రయాణిస్తున్న వాహనదారులు » పట్టించుకోని అధికారులు » రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని వినతి



కొణిజర్ల, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నుంచి పల్లిపాడు మీదుగా ఏన్కూర్ నేషనల్ రోడ్డుకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారికి లాలాపురం, తీగలబంజర గ్రామాల మధ్య ఉన్న పగిడేరు వాగుపై వంతెనను నిర్మించారు. ఆ వంతెనరోడ్డుకు దిగువభాగంలో ఉంటుంది. అనేక ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన కావడంతో శిథిలావస్థకు చేరింది. వంతెనకి రెండు వైపుల రక్షణ గోడలు కూడా లేవు. ఆ వంతెన వద్ద రెండు వాహనాలు ఎదురుగా వస్తే వాహనదారులు ప్రాణాలు గుండెల్లో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తుంది. లోలెవల్‌లో వంతెన ఉండటం వలన వర్షాలు వస్తే రాకపోకలు నిలిచిపోతాయి. గతంలో వర్షాలకు వంతెనపై తారు మొత్తం కొట్టుకుపోయింది. అయిన అధికారులు ఆ వంతెనని చిన్నచూపు చూస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ప్రధానరోడ్డుపై ఎలాగైతే వాహనాలు రద్దీగా వెళ్తుంటాయో, అదే విధంగా ఈ రహదారి నుంచి కూడా అలాగే వాహనాలు వెళ్తుంటాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వెళ్లేవారు కూడా ఈ రహదారి నుంచి వెళ్తుంటారు. ఖమ్మం వైరా, తల్లాడ నుంచి వెళ్లితే దూరం ఎక్కువ అవుతుందని, పల్లిపాడు నుంచి నేరుగా ఏన్కూర్‌కు రావచ్చని వాహనదారులు ఈ రోడ్డు మార్గానే ప్రయాణిస్తారు. భద్రాచలం వైపు నుంచి ఎక్కువగా ఇసుకలారీలు భారీ లోడులతో ఈ రహదారి నుంచి వస్తుంటాయి. నిత్యం రద్దీగా తిరిగే రహదారికి వంతెన వద్ద ప్రమాదం పొంచిఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడంలేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి ఎత్తును పెంచి రహదారి ఎప్పుడు వేస్తారో, మోక్షం ఎప్పుడు వస్తుందోనని ప్రయాణికులు, వాహనదారులు ఎదురు చూస్తున్నారు.

రక్షణ గోడలు నిర్మించాలి

● పోట్ల కృష్ణార్జునరావు



రోడ్డుదిగువలో ఉన్న పగిడేరు వాగుపై బ్రిడ్జికి రక్షణ గోడలు లేక వాహనదారులు, ప్రయాణికులు నిత్యం భయపడుతున్నారు. అధికారులు తక్షణమే బ్రిడ్జికి రక్షణ గోడలు నిర్మించాలి. వర్షాలు వచ్చినప్పుడల్లా బ్రిడ్జి మునిగి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఉన్నతాధికారులు సమస్యను గుర్తించి బ్రిడ్జికి మరమ్మతులు చేయాలి.

రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

» అదనపు కలెక్టర్ శ్రీజ


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

మధిర రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అర్హులైన యువత రాజీవ్ యువవికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. మంగళవారం మధిర మండలం దెందుకూరు గ్రామం లో రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీవ్ యుక వికా సం దరఖాస్తు గడువును ప్రభుత్వం ఈనెల 14వరకు పెంచిందని, అర్హులైన నిరుద్యోగ యు వత పూర్తిస్థాయిలో దరఖాస్తు చేసుకొని ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందాలన్నారు. నిరుద్యోగ యువతపై పెద్ద మొత్తంలో ప్రభు త్వం నిధులు ఖర్చు చేస్తూ రాజీవ్ యువ వికా సం పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. తెల్లరేషన్‌కార్డులో దరఖాస్తు దారుడి పేరు లేని పక్షంలో గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం పరిమితి రూ.1.50లక్షల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.రెండులక్షలలోపు ఆదాయ సర్టిఫికెట్ సమర్పించాలని సూచించారు. లబ్ధిదారులను ఎంపిక చేసిన తర్వాత వారికి మంజూరు పత్రాలు జారీ చేయడంతో పాటు వ్యాపార నిర్వహణలో పాటించాల్సిన సూత్రాలపై శిక్షణ కూడా అందిస్తామని, ఆసక్తి గల యువకులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీజ సూచించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీ నవీన్‌బాబు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి: ఏఐటీయూసీ


సమావేశంలో మాట్లాడుతున్న మల్లయ్య

కల్లూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిని కొనసాగించాలని జిల్లా గ్రామ పంచాయ తీ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య రాష్ట్ర ప్రభుత్వా న్ని కోరారు. కల్లూరులో మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మండల స్థాయిలో గ్రామ పంచాయతీ కార్మికుల సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, కంభంపాటి మహేష్, బానోతు మంగీలాల్, జానపాటి మల్లేష్, ఏఐటీయూసీ నాయకుడు దమాల దయాకర్ తదితరులున్నారు.

మజ్జిగ పంపిణీ


మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న నరసింహారావు

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా సత్తుపల్లి మండలం కిష్టారం ఓసీలో మంగళవారం ఉద్యోగుల సంక్షేమం కోసం మజ్జిగ ప్యాకెట్లను ఉచితంగా పంపిణీచేశారు. ఈ సందర్భంగా పీవో ఎంవీ.నరసింహారావు మాట్లాడుతూ వేసవికాలంలో డిహైడ్రేషన్ కాకుండా కాపాడుకోవడం కోసం ప్రతిఒక్కరి బాధ్యత అని, అందుకు తరచుగా నీళ్లుతాగుతూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కాలరీ మేనేజర్ రామకృష్ణ, రక్షణాధికారి గోపీకిషోర్, వెల్ఫేర్ ఆఫీసర్ సందీప్, పాల్గొన్నారు.

భక్తాంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లలితకుమారి ఆసుపత్రి వీధిలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు రామిశెట్టి నాగేశ్వరరావు, ఈశ్వర్‌కుమార్, బొమ్మిన వెంకట్రావ్, సునీత, భావన, శ్యామ్‌సుందర్, గుడిమెట్ల తేజేష్‌కుమార్, చొప్పరపు నగేష్, దివ్య సహకారంతో భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా కోటమైసమ్మతల్లి బ్రహ్మోత్సవాలు

కారేపల్లి, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో గల కోట మైసమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు రెండో రోజు ఘనంగా జరిగాయి. అమ్మవారికి మహిళలు జలబిందెలతో నీటిని తీసుకువచ్చి జాలాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజా చేశారు. ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పాల్గొని పూజలు చేశారు. ఈసందర్భంగా ఇల్లెందు పట్టణానికి చెందిన కాకతీయ స్కూలు యాజమాన్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పర్సపట్టాబి రామారావు, విజయలక్ష్మి దంపతులు, ఈవో వేణుగోపాలచార్యులు, పూజారి కైలాష్‌శర్మ, సిబ్బంది మోహన్‌కృష్ణ, సాయి, తాటిపల్లి సుబ్బారావు, కుమారి, జగ్గయ్య, జాలసాంబ, తదితరులు పాల్గొన్నారు.


కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

» ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్


సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఏన్కూరు, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ అన్నారు. మండలంలోని జన్నారం, తిమ్మారావుపేట చౌకదుకాణంలో మంగళవారం సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, మం డల పార్టీ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, భూక్యాలాలునాయక్, చదమామ నరసింహారావు రేగళ్ల నాగయ్య, సాలియి నాగయ్య, పులబాల నరసింహారావు, మాలో తు నరసింహారావు, కట్టసత్యనారాయణ దళపతి భువనేశ్వరరాజు, బాబులాల్‌నాయక్ తదితరులున్నారు.

కారేపల్లిలో...

కారేపల్లి: తెలంగాణ ప్రభుత్వం పేదప్రజలకు అందిస్తున్న సన్నబియ్యం పథకం పేదలకు వరం లాంటిందని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని భాగ్యనగర్‌తండాలో ప్రభుత్వం పంపిణీ చేసిన సన్నబియ్యం పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తలారి చంద్రప్రకాష్, కాం గ్రెస్ రాష్ట్ర నాయకురాలు పగడాల మంజుల, బాణోత్ రాంమూర్తి, తిరుపతిరావు, మేదరిటోని, మల్లెలు నాగేశ్వరరావు, భీముడు, తదితరులుపాల్గొన్నారు.

ఎర్రుపాలెంలో....

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని ఎర్రుపాలెం రేషన్ షాపులో ప్రభుత్వం ఉగాదిరోజున ప్రారంభించిన సన్న బియ్యం పథకాన్ని మధిర వ్యవసాయామార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు మంగళవారం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, సొసైటీ వైస్‌చైర్మన్ కడియం శ్రీనివాసరావు, మల్లెల లక్ష్మణరావు, పంబి సాంబశివరావు, షేక్ జానీబాషా, దేవరకొండ రాజీవ్‌గాంధీ, కంచర్ల వెంకటనరసయ్య, గుడేటి బాబురావు, దేవరకొండ శ్రీనివాసరావు, అను భార్గవ్, బుర్రనారాయన, రవి, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బోనకల్‌లో...

బోనకల్: మండలంలోని అన్ని గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముష్టికుంట్ల గ్రామంలో తహసీల్దార్ పున్నం చందర్, రాయనపేట గ్రామంలో ఆత్మకమిటీ చైర్మన్ కర్నాటీ రామకోటేశ్వరరావులతో పాటు పలు గ్రామాల్లో నాయకులు, అధికారులు, డీలర్లు ప్రారంభించారు.

పీఆర్టీయూ నాయకుల పాదయాత్ర


కొణిజర్లలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వెంకటేశ్వర్లు

వైరా, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అభ్యర్థిగా పోటీచేసి పింగళి శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించిన నేపథ్యంలో ఖమ్మంజిల్లా పీఆర్టీయూ నాయకులు మంగళవారం వైరాలోని శివాలయంలో మొక్కులు చెల్లించారు. పీఆర్టీయూ ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం ఇందిరానగర్ వినాయకుని ఆలయం నుంచి వైరాలోని పాత శివాలయం వరకు ఆసంఘం జిల్లా అధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ప్రధాన అర్చకుడు కేతముక్కల సురేష్‌కుమార్‌శర్మ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు వెలిశెట్టి నర్సింహారావు, వెలిశెట్టి నర్సింహారావు, వేమిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, డి.సత్యనారాయణ, ఎన్.జాన్, పాటి రామచంద్రయ్య, సరిత, రూప, సునీత, పుట్లూరి వెంకటేశ్వర్‌రెడ్డి, విజయ అమృతకుమార్, లింగం సతీష్ పాల్గొన్నారు.

కొణిజర్ల, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన పింగలి శ్రీపాల్‌రెడ్డి గెలిచిన సందర్భంగా మంగళవారం జిల్లా పీఆర్టీయూ బృందం వైరా పాతశివాలయానికి పాదయాత్రగా వెళ్లి మొక్కుతీర్చుకున్నారు. ఈ సందర్భంగా కొణిజర్లలో కాంగ్రెస్ జిల్లా నాయకులు, మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు పాదయాత్ర బృందానికి స్వాగతం పలికారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు బస్వాపురం క్రాస్‌రోడ్డులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రమేష్, చల్లగుండ్ల సురేష్, కొనతం ఉమాశంకర్, రత్నాకర్, పుల్లయ్యచారి, గోపాల్, రమేష్, బిక్షం తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో క్రైస్తవుల శాంతిర్యాలీ


ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపట్ల సత్తుపల్లిలో మంగళవారం క్రైస్తవులు సమైక్య శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం నుంచి పట్టణంలో ర్యాలీగా వెళ్లి రింగ్ సెంటర్‌లో క్రైస్తవ నాయకులు మాట్లాడారు. ప్రవీణ్ హత్యకు గల కారణాలను ఆంధ్రాలోని రాష్ట్రప్రభుత్వం విచారణ చేపట్టి నిజానిజాలు నిర్ధారణ చేయాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు, నాయకులు, తదితరులున్నారు.

గ్రూప్-1 ర్యాంకర్‌కు సన్మానం

వైరా, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీలోని తొమ్మిదో వార్డుకు చెందిన గ్రూప్-1 ర్యాంకర్ సంగెపు లక్ష్మీ సాహితిని మంగళవారం పలువురు అభినందించి సన్మానించారు. గ్రూప్-1లో రాష్ట్రస్థాయి 129వ ర్యాంకు, మల్టీజోన్-1లో 69వ ర్యాంకు సాధించిన లక్ష్మీసాహితిని టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు అభినందించి శాలువాతో సన్మానించారు. స్వీట్లు పంపిణీ చేశారు. మాదినేని రాంనారాయణ, కట్ల శ్రీకాంత్, సంతోష్, వేదిత సైన, సంజీవ్‌పార్థు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే స్థానిక వ్యాపారి వజినేపల్లి చక్రవర్తి కూడా లక్ష్మీసాహితీని సన్మానించి అభినందించారు. గుమ్మడదల వెంకటనారాయణ, ఆమె తల్లిదండ్రులు సంగెపు వెంకటేశ్వరరావు, కవిత, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.


లక్ష్మీసాహితిని సన్మానిస్తున్న కట్ల రంగారావు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


ధాన్యం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రామారావు

కల్లూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ అధ్యక్షుడు పాలెపు రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఎం. రూప, చెన్నూరు సొసైటీ డైరెక్టర్లు రావూరి వెంకటేశ్వరరావు, అర్జునరావు, చిన్న వెంకటేశ్వరరావు, రైతులు మాదాల వెంకటేశ్వరరావు, రామిరెడ్డి, నల్లజాల మంగపతి, సీఈవో దేవరపల్లి మురళికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెంకటలాలయ్య సేవలు మరువలేనివి: సీపీఐ

కొణిజర్ల, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): గ్రామ అభివృద్ధిలో, పార్టీ విస్తరణలో యాసా వెంకటలాలయ్య చేసిన సేవలు, త్యాగాలు మరువలేనివని సీపీఐ జాతీయసమితి సభ్యుడు బాగం హేమంతరావు కొనియాడారు. మంగళవారం మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో జరిగిన యాసా వెంకటలాలయ్య వర్ధంతిసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, పార్టీ సీనియర్ నాయకులు గడల సీతారామయ్య, జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్, యర్రాబాబు, దొండపాటి రమేష్, తాటి వెంకటేశ్వరరావు, కొణపర్తి విష్ణుమూర్తి, లేడిబోయిన గోపాల్‌రావు, పీవీరావు, యాసా వెంకటేశ్వరరావు, యాసా సత్యనారాయణ, ఏసు, భరత్, ప్రసాద్, రంజాన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

తల్లాడ, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): రెడ్డిగూడెం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వైరాకు చెందిన షేక్.మీరా టీవీఎస్ మోపెడ్‌పై తల్లాడ నుంచి వైరా వెళ్తూ మార్గమధ్యలో రెడ్డిగూడెం వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మీరా తీ వ్రంగా గాయపడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని 108వాహనంలో చికి త్స కోసం ఖమ్మం తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మీరా మనుమడు పాషా ఫిర్యాదు మేరకు ఎస్ఐ కొండల్‌రావు కేసు నమోదు చేశా రు.

వైరాలో బస్సు, లారీ ఢీ...

వైరా, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వైరా రింగ్‌రోడ్డు వద్ద బస్సు లారీ ఢీకొన్న ఘటనలో 10మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఖమ్మం నుంచి మణుగూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు స్థానిక రింగ్‌రోడ్డు వద్ద తల్లాడ వైపు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ ఢీ కొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 10 మందికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

బాధిత కుటుంబాలకు సీపీఎం నాయకుల పరామర్శ

బోనకల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో చెరువులో నీట మునిగి మృతి చెందిన పఠాన్ యుసఫ్‌ఖాన్, కరిముల్లా మృతదేహాలను మంగళవారం సీపీఎం జిల్లా, డివిజన్ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, మడిపల్లి గోపాలరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేష్, మర్రి తిరుపతిరావు, పారా లక్ష్మీనారాయణ, బండి నాగేశ్వరరావులు సందర్శించి నివాళులర్పించారు. అదే విధంగా ముస్లిం ఐక్య సంఘ మండల నాయకులు షేక్ మహబూబ్ పాషా, చాంద్‌సాహెబ్, దస్తగిరి, జాన్‌మీయాలు మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆపరేషన్ కగార్‌ను నిలుపుదల చేయాలి

బోనకల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను నిలుపుదల చేయాలని కోరుతూ మంగళవారం బోనకల్‌లో ఎన్‌డీ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకుడు ఎం.గిరి మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన హైదరాబాద్‌లో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. అటవీ ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున ఆదివాసీలను ఎన్‌కౌంటర్లు చేసి హత మార్చడం అప్రజాస్వామ్యంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఖాసీం, వి.వి రావు, విజయ్ నవీన్, భాషా, తదితరులు పాల్గొన్నారు.

'సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడాలి'

వైరా, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400ఎకరాల భూముల విక్రయాలను నిలుపుదల చేయాలని జరుగుతున్న అల్లర్ల నేపథ్యంలో మంగళవారం వైరాలో సీపీఎం నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, తోట నాగేశ్వరరావు, పట్టణ కమిటీ సభ్యురాలు తోట కృష్ణవేణిని ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

కొణిజర్లలో...

కొణిజర్ల: రాష్ట్ర ప్రభుత్వం చేసే నిర్ణయాలు ప్రజలకు వ్యతిరేకంగా ఉంటున్నాయని, ప్రజలకు అనుకూలంగా ఉండాలని సీపీఎం మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు కోరారు. మంగళవారం సీపీఎం నాయకుల అరెస్ట్ పై ఆయన మాట్లాడారు. తాళ్లపల్లి కృష్ణ, చింతనిప్పు చలపతి, మోత్కూరు వెంకటేశ్వరరావు, మాధవరెడ్డి, అప్జల్‌ను పోలీసులు అక్రమంగా ముందస్తుగా అరెస్ట్ చేశారు.

ముదిగొండలో..

ముదిగొండ: హైదరాబాద్‌లో సెంట్రల్ యూనివర్సిటీలో జరుగుతున్న ఉద్యమానికి వెళ్తున్నారనే సమాచారం మేరకు సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, నాయకులు బట్టు రాజు, మెట్టెల సతీష్, పొనుకుల సుధాకర్, పల్లపాటి నాగేశ్వరరావు, గుడిమెట్ల సాయిలను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.


వైరాలో..


కొణిజర్లలో...

కారేపల్లిలో...

కారేపల్లి: మండల పరిధిలోని సీపీఎం, ప్రజా సంఘాల నా యకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. కొండబోయిన నాగేశ్వరరావు, కె.నరేంద్ర, ముక్కసీతారాములు, తాళ్లపల్లి కృష్ణ, చలపతిరావు, బన్సీసలాల్, దేవప్రకాష్, షేక్ అప్జల్‌తదితరులను అదుపులోకి తీసుకున్నారు.

తల్లాడలో...

తల్లాడ: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను వేలం వేయటాన్ని నిరసిస్తూ బుధవారం అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో జరిగే ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు ఐనాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, శీలం పకీరమ్మ, షేక్.మస్తాన్ పాల్గొన్నారు.

హైదరాబాద్ వెళ్తున్న సీపీఎం నాయకులను సోమవారం అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టైన వారిలో సీపీఎం మండల కార్యదర్శి ఐనాల రామలింగేశ్వరరావు, షేక్.మస్తాన్, చల్లా నాగేశ్వరరావు ఉన్నారు.

వేంసూరులో...

వేంసూరు: సెంట్రల్ యూనివర్సిటీ భూములు అమ్మవద్దని ఆయూనివర్సిటీ క్యాంపస్ స్కూల్లో చదువుతున్న మండలంలోని మర్లపాడు గ్రామానికి చెందిన భాస్కర్ల యశస్వి, జాహ్నవిలు కోరారు. సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన ధర్నా కార్యక్రమంలో ఈ విద్యార్థినులు పాల్గొన్నారు.

బోనకల్‌లో...

బోనకల్: సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని ప్రభుత్వం నిలిపివేయాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేష్, బోయినపల్లి వీరబాబు, నరేష్ పాల్గొన్నారు.



బోనకల్‌లో మాట్లాడుతున్న గోపాలరావు